

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
ఆదివారం, 17 నవంబరు 2024

డాలర్ డ్రీమ్స్

అదే కథ.. మారని కథ... బీటెక్ పూర్తికాగానే యువత డాలర్ డ్రీమ్స్‌లో తేలిపోతోంది. పట్టా చేతికందగానే పాలోమంటూ విదేశాలకు పయనం కట్టడానికి తహతహలాడుతోంది. తక్కువ శ్రమ ఎక్కువ ప్రతిఫలం... కొద్ది సమయంలోనే నోట్లకు పడగలెత్తే అవకాశాలుండటం.. విలాసాలతో కూడిన ఆధునిక జీవనశైలి.. నాణ్యమైన ప్రమాణాలు.... ఇలా ఒక్కటేమిటి అనేకానేక అంశాలు.. యువత విదేశాలకు వెళ్లేందుకు పురికొల్పుతున్నాయి. ఇండియా నుంచి ప్రత్యేకించి తెలుగు రాష్ట్రాల నుంచి స్ప్రింగ్, ఫాల్ సీజన్‌లలో వేలాదిమంది ఎం.ఎస్. చదువుల పేరుతో అమెరికా, ఆస్ట్రేలియా, కెనెడా, జర్మనీ, యూకే వంటి దేశాలకు తరలిపోతున్నారు. ఇండియాలో ఉద్యోగ అవకాశాలు, సంపాదన, జీవనశైలి ఆశించిన స్థాయిలో లేకపోవడంతో నేటి యువత విదేశాలకు తరలివెళ్లేందుకే మొగ్గు చూపుతున్నారు. తమ కుటుంబంలోని వాళ్లు, తమ ఊరి వాళ్లు, తమ బంధువులు అప్పటికే విదేశాల్లో స్థిరపడటంతో వారి ఆలంబనగా ఏడాదికేడాది పెద్ద సంఖ్యలో యువత విదేశాల బాటపడుతున్నారు.








మీ కుటుంబ నేపథ్యం..?

మధ్య తరగతి	64.00 శాతం
ఎగువ తరగతి	17.00 శాతం
దిగువ మధ్యతరగతి	10.00 శాతం
పేద కుటుంబం	09.00 శాతం



ఎమ్మెస్ తర్వాత తిరిగి వస్తారా?

కొంతకాలం ఉద్యోగం చేసి వస్తాం	40.00 శాతం
అక్కడే సెటిల్ అవుతాం	38.50 శాతం
అయిపోగానే తిరిగి వచ్చేస్తాం	21.50 శాతం

- విదేశాలకు వెళ్లేందుకే యువత మక్కువ
- ప్రతీ 10 మందిలో నలుగురిది అదే ఆలోచన
- తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించుకునే అవకాశాలు
- ఆర్థిక పరిస్థితులు మెరుగుపర్చుకోవడమే లక్ష్యం
- ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉండటమూ కారణమే
- మధ్యతరగతి కుటుంబాల నుంచే ఎక్కువ సంఖ్యలో పయనం
- ఎం.ఎస్. తర్వాత తిరిగి ఇండియా రావడంపై అనాసక్తి
- 'ఆంధ్రజ్యోతి' సర్వేలో వెల్లడైన నేటి యువత మనోగతం

ఆంధ్రజ్యోతి సర్వే


ఖమ్మం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఊరికి ఒక్కరు విదేశాల్లో ఉంటే గొప్పగా చెప్పుకునే రోజుల నుంచి ప్రతీ గ్రామం నుంచి పదుల సంఖ్యలో వెళ్లే రోజులు వచ్చాయి. పేరుకు ఎం.ఎస్. చదువు అయినా, తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించడంతోపాటు అక్కడే స్థిరపడే లక్ష్యంతో యువత విదేశాలను ఎంచుకుంటోంది. విదేశాలకు వెళ్లడానికి రోజు రోజుకూ ఎందుకంత ఆసక్తి పెరుగుతోంది..? అక్కడి పరిస్థితులకు, దేశంలో ఉన్న పరిస్థితులకు తేడాలు ఏమిటి..? కుటుంబ ఆర్థిక పరిస్థితులు కారణాలుగా నిలుస్తున్నాయా..? విదేశాలకు వెళ్లిన వారు మళ్లీ ఇండియాకు తిరిగివస్తారా..? వంటి అంశాలపై ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 'ఆంధ్రజ్యోతి' సర్వే నిర్వహించింది. వివిధ వర్గాల యువతను ఎంచుకొని వారి మనోగతాన్ని సేకరించింది. ఈ సర్వేలో నేటి యువత ఆలోచనా ధోరణి ప్రస్ఫుటమైంది. వారి ప్రణాళికలు, లక్ష్యాలు, అభిప్రాయాలు ఆసక్తికరంగా వున్నాయి.

మధ్యతరగతి కుటుంబాల నుంచే ఎక్కువ..

పడిపోతున్న రూపాయి విలువ, తగ్గిపోతున్న ఉపాధి అవకాశాలు, ఉద్యోగం లభించేందుకు కాలయాపన.. వీటన్నింటికీ మించిన కుటుంబ ఆర్థిక పరిస్థితులు. ప్రతీ పదిమంది యువతలో సగంమంది విదేశాలకు వెళ్లడానికి ఇవే కారణాలుగా కనిపిస్తున్నాయి. ఎంతో కష్టపడి చదివించిన తల్లిదండ్రులకు తాము భారం కాకూడదనకుంటున్నారు, ముున్ముందు తమ తల్లిదండ్రులను కష్టాల కొలిమిలోకి నెట్టేయకూడదన్న భావనతో చాలామంది యువత తమ ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చుకునేందుకు విదేశాలకు వెళ్లేందుకు సిద్ధపడుతున్నారు. అప్పటివరకు తమ తల్లిదండ్రులు తమకోసం సాగించిన పోరాటం చాలనీ, ఇకమీదట తమ చదువు తమ డబ్బులతోనే కొనసాగిస్తామన్న భరోసా కోసం కొందరు యువత ఇతర దేశాలవైపు చూస్తోంది. అందుకోసం ఇంకొంత ఆర్థిక భారమైనా సరే.. బ్యాంకు లోన్లు తీసుకుని మరీ విదేశాల్లో చదువుకునేందుకు పయనమవుతున్నారు. అలా పయనమయ్యే వారిలో అత్యధిక శాతం మంది మధ్యతరగతి కుటుంబాలు, అంతకన్నా తక్కువస్థాయివారే ఉన్నట్టుగా 'ఆంధ్రజ్యోతి' సర్వేలో వెల్లడైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇటీవల కాలంలో విదేశాల్లో డిగ్రీ చదివేందుకు వెళ్లిన, వెళ్లడానికి సిద్ధంగా ఉన్న పలువురి యువత నుంచి ఆరు ప్రశ్నలతో 200 మంది అభిప్రాయాలను సేకరించింది. వారిలో 64 శాతం మధ్యతరగతి కుటుంబ నేపథ్యం కలిగిన వారుండగా.. 17 శాతం మాత్రమే ఎగువ తరగతి వారుండటం గమనార్హం. ఇక దిగువ మధ్యతరగతి 10 శాతం, పేద కుటుంబం 9శాతం ఉన్నారు.


వెళ్లడానికి కారణాలివే...

ఒకరి తర్వాత మరొకరు వరుసగా విదేశాలకు క్యూ కడుతున్న యువత అక్కడకు వెళ్లాలని తీసుకున్న (మిగతా 6వ పేజీలో)




విదేశాలకు వెళ్లాలని ఎందుకు అనుకుంటున్నారు?

ఉపాధి అవకాశాలు బాగుంటాయి	38.00 శాతం
విదేశీ డిగ్రీకి ఎక్కువ విలువ	26.50 శాతం
డబ్బు సంపాదన కోసం	22.00 శాతం
స్థానికంగా ఉద్యోగ అవకాశాలు లేవు	13.50 శాతం




మీకు ప్రేరణ ఎవరు?

సొంత నిర్ణయం	46.00 శాతం
తల్లిదండ్రులు	25.50 శాతం
స్నేహితులు	20.50 శాతం
బంధువులు	08.00 శాతం



ప్రభుత్వ సహకారం ఎలా ఉంది?

బాగుంది	38.50 శాతం
బాగాలేదు	61.50 శాతం



రుణాలు ఎక్కడ తీసుకుంటున్నారు?

ప్రభుత్వ బ్యాంకులు	55.00 శాతం
ప్రైవేటు బ్యాంకులు	45.00 శాతం

విదేశీ చదువులపై యువత
ఏమంటున్నారంటే... 6

ముఖాముఖి



క్రీడా సంఘాలు నిబంధనలు పాటించాలి

సునిల్‌రెడ్డి, జిల్లా యువజన, క్రీడల అధికారి, ఖమ్మం

ప్రశ్న: డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీపరిధిలో జిల్లాలో గుర్తింపుపొందినక్రీడాసంఘాలెన్ని?

జవాబు: 18 క్రీడా సంఘాలు డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ రికార్డులో నమోదయ్యాయి. మొత్తం 28 క్రీడాంశాలకు సంబంధించిన సంఘాలు ఉన్నా కొన్ని సంఘాలు బైలాను పట్టించుకోవడం లేదు. వారికి గుర్తింపు ఇవ్వం.

ప్ర: క్రీడా సంఘాల ఎన్నికలు సక్రమంగా నిర్వహిస్తున్నారా?

జ: కొన్ని క్రీడా సంఘాలు ఆయా సంఘాల బైలా, శాట్స్ నిబంధనల ప్రకారమే ఎన్నికలు జరుపుకొంటున్నాయి. వారి కోరిక మేరకు ఎన్నికలకు డిస్ట్రిక్ట్ అథారిటీ తరపున ఒక పరిశీలకుడిని పంపుతున్నాం.

ప్ర: ఒకే క్రీడాంశానికి రెండు, మూడు సంఘాలు ఉంటున్నాయి. వాటి పరిస్థితి?

జ: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ నిబంధనలు(బైలా) అనుసరించి ఏదైనా రాష్ట్ర క్రీడా అసోసియేషన్ అఫిలియేషన్ (గుర్తింపు) ఉండి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థకు జవాబుదారీగా ఉన్న సంఘం మాత్రమే జిల్లాలో క్రీడా సంఘంగా గుర్తింపు పొందుతుంది.

ప్ర: జిల్లాకు సంబంధం లేని వారి చేతుల్లో కొన్ని క్రీడా సంఘాలు ఉన్నాయి వారిపై చర్యలు తీసుకుంటారా?

జ: అలాంటి వారిపై చర్యలు తీసుకునే అధికారం డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీకి లేదు. గతంలో ఉమ్మడి జిల్లాగా ఉన్నపుడు కొన్ని క్రీడా సంఘాలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వారిని ఎన్నుకున్నారు. ఆయా సంఘాల పదవీకాలం ముగిసే వరకు వారే కొనసాగే అవకాశం ఉంది.

ప్ర: జిల్లాలో క్రీడల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: కలెక్టర్ సూచనలతో నిపుణులైన కోచ్‌ల నియామకం దగ్గర్నుంచి, ప్రతిభగల క్రీడాకారులను గుర్తించి వారిని జాతీయ, అంతర్జాతీయ పోటీలకు పంపే వరకు బాసటగా నిలుస్తున్నాం.

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం స్పోర్ట్స్

గ్రూప్-3 పరీక్షలకు సర్వం సిద్ధం

- ఖమ్మం జిల్లాలో 87 పరీక్ష కేంద్రాలు.. 27 వేల మంది అభ్యర్థులు...
- భద్రాద్రి జిల్లాలో 39 పరీక్ష కేంద్రాలు.. 13 వేల మంది అభ్యర్థులు...
- నిబంధనలు కచ్చితంగా పాటించాలి
- అదనపు కలెక్టర్ శ్రీజ



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం కలెక్టరేట్/కొత్తగూడెం అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రూప్ -3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు అదనపు కలెక్టర్ శ్రీజ తెలిపారు. ఆది, సోమవారాల్లో నిర్వహించనున్న గ్రూప్ -3 పరీక్షా కేంద్రాలను శనివారం ఆమె తనిఖీ చేశారు. చింతకాని మండలం రామకృష్ణాపురంలోని సెంట్ థెరిస్సా పాఠశాల, ఖమ్మం విన్‌ఫీల్డ్ పాఠశాల, ఖమ్మం రూరల్ మండలం సత్యనారాయణపురంలోని దరిపెల్లి అనంత రాములు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, పెద్దతండాలోని ప్రియదర్శిని కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్, రూట్ అధికారులు, ప్రాంతీయ కో-ఆర్డినేటర్లు సమన్వయం చేసుకుంటూ పారదర్శకంగా పరీక్షను నిర్వహించాలన్నారు.

17 ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12-30 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5-30 వరకు రెండు విడతలుగా, నవంబరు 18న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12-30 వరకు గ్రూప్-3 పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 27 వేల 984 మంది అభ్యర్థులు పరీక్షలు హాజరుకానున్నట్టు, వీరి కోసం 87 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు అదనపు కలెక్టర్ తెలిపారు.

పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు క్యాలిక్యులేటర్, పేజర్స్, సెల్‌ఫోన్, టాబ్లెట్స్, పెన్ డ్రైవ్, బ్లూటూత్ డివైజెస్, వాచ్, మాథమేటికల్ టేబుల్, లాగ్ టేబుల్, హ్యాండ్ బ్యాగ్స్, జోలాస్, పౌచెస్, రైటింగ్ ప్యాడ్స్, నోట్స్, చార్ట్స్, లూజ్ షీట్స్, జ్యువెలరీ (మంగళసూత్రం, గాజులు సంబంధిత ఐటెమ్స్ మినహాయించి), (మిగతా 6వ పేజీలో)



ఖమ్మంలో మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలం

- రైతు రుణమాఫీని పూర్తి స్థాయిలో అమలు చేయలేదు
- రాష్ట్ర వ్యాప్త ఉద్యమాల నిర్వహణకు కార్యాచరణ
- మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు 6

ముక్కోటికి ఏర్పాట్లు

- రూ.1.30 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు
- డిసెంబరు 31 నుంచి జనవరి 20 వరకు నిర్వహణ
- టెండర్లను ఆహ్వానించిన అధికారులు

భద్రాచలం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించనున్న వైకుంఠ ఏకాదశి మహోత్సవాల(ముక్కోటి)కు రూ.1.30 కోట్లతో పనులు చేపట్టనున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు డిసెంబరు 31 నుంచి 2025 జనవరి 20 వరకు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో జనవరి 9న పవిత్ర గోదావరిలో స్వామి వారికి తెప్పోత్సవం, 10న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఉత్తరద్వారంలో స్వామి వారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ నేపథ్యంలో భారీ ఎత్తున ఏర్పాట్లను చేపట్టేందుకు రంగం సిద్ధం చేసింది. రూ.1.30 కోట్లతో ముక్కోటి పనులను చేపట్టనుండగా ఇందులో రూ.84.21 లక్షలతో ఇంజనీరింగు విభాగం ద్వారా పనులు చేపట్టేందుకు కేటాయించారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా సరిహద్దున ఉన్న ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు తరలి వస్తుంటారు. ఈ క్రమంలో ఇప్పటికే అధికార యంత్రాంగం ఇందుకు సంబంధించి ప్రాథమిక కసరత్తు పూర్తి చేసి టెండర్లను ఆహ్వానించారు.

రూ.84 లక్షలతో పనులు

భద్రాద్రి దేవస్థానంలోని ఇంజనీరింగు విభాగం ఆధ్వర్యంలో మొత్తం 15 రకాల పనులకుగాను రూ.84.21 లక్షలతో పనులను చేపట్టనున్నారు. రూ.16.25 లక్షలతో భద్రాచలం పర్ణశాల ఆలయాలకు, గోదావరి ఘాట్‌లకు రంగులు వేయనున్నారు. అలాగే రూ.9.20 లక్షలతో పంచరంగులతో గోపురం, నిత్యకల్యాణ మండపం, వైకుంఠ ద్వారం, గోశాలలకు వేయనున్నారు. రూ.12.60 లక్షలతో భద్రాచలం, పర్ణశాలలో విద్యుద్దీపాలంకరణ, రూ.5.50 లక్షలతో తాత్కాలిక భక్తుల వసతి షెడ్లు, మహిళలు దుస్తులు మార్చుకునే గదుల నిర్మాణం, రూ.5 లక్షలతో హంసాలంకృత తెప్ప తయారీ, రూ.6.18 లక్షలతో తెప్పోత్సవం సమయంలో ఉపయోగించే బాణసంచా కొనుగోలుకు, రూ.4.68 లక్షలతో క్లాత్ డెకరేషన్‌తో ఇతర పనులను చేయనున్నారు.

మృత్యువులోనూ వీడని బంధం

- రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమారుడు మృతి
- భార్య పరిస్థితి విషమం
- ట్రాక్టర్‌ను ఢీ కొట్టిన బైక్
- భద్రాద్రి జిల్లా తిప్పనపల్లి వద్ద ఘటన



సతీష్‌కుమార్‌శర్మ, హనీశ్వర్ మృతదేహాలు



చండ్రుగొండ/ఎర్రుపాలెం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): బ్యాంకు పని మీద ఊరు వెళ్లి వస్తూ ఊహించని రోడ్డు ప్రమాదంలో తండ్రీ, కుమారుడు మృతి చెందారు. భద్రాద్రి జిల్లా చండ్రుగొండ మండలం తిప్పనపల్లి వద్ద శనివారం ఆగి ఉన్న ట్రాక్టర్‌ను బైక్ ఢీకొట్టిన ఘటనలో ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం కొత్తపాలెం ఆంజనేయస్వామి ఆలయంలో పూజారిగా పనిచేస్తున్న చిలుమూరి సతీష్‌కుమార్‌శర్మ(40), అతడి కుమారుడు హనీశ్వర్(9) మృతి చెందారు. కొన్నేళ్ల క్రితం ఆంధ్రా నుంచి వలస వచ్చిన సతీష్‌కుమార్‌శర్మ భార్య, పిల్లలతో కలిసి భద్రాద్రి జిల్లా అశ్వాపురంలోని ఓ ఆలయంలో పూజారిగా పనిచేశాడు. సంవత్సరం క్రితం ఆయన ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలోని కొత్తపాలెం గ్రామానికి వచ్చి అక్కడి ఆంజనేయస్వామి ఆలయంలో పూజారిగా చేరాడు. ఈ క్రమంలో శనివారం తాను గతంలో పనిచేసిన అశ్వాపురానికి బ్యాంక్ పనిమీద భార్య హిమబిందు, కుమారుడు హనీశ్వర్‌తో కలిసి బైక్‌పై వెళ్లాడు. అక్కడ పని ముగించుకొని తిరిగి వస్తుండగా చండ్రుగొండ మండలం తిప్పనపల్లి వద్ద బైక్ అదుపుతప్పి ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సతీష్‌కుమార్ శర్మ, అతడి కుమారుడు హనీశ్వర్ అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడ్డ భార్య హిమబిందుని కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడి కుమార్తె నిత్యలక్ష్మి ఎర్రుపాలెం కస్తూర్బాగాంధీ పాఠశాలలో ఆరో తగరతి చదువుతోంది. పూజారి సతీష్‌కుమార్‌శర్మ ప్రస్తుతం అయ్యప్పమాల ధరించిఉన్నాడు. ఇంతలోనే రోడ్డు ప్రమాదంలో అతడు మృతి చెందడంతో కొత్తపాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కిన్నెర కెనాల్‌లో తెడ్డు పడవపై
కలెక్టర్ ట్రయల్‌రన్


తెడ్డు పడవలో కలెక్టర్

పాల్వంచ రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిన్నెరసాని జలాశయం నుంచి కేటీపీఎస్ కెనాల్‌లో పర్యాటకులు తెడ్డుపడవలో తిరిగేందుకు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ శనివారం ట్రయల్‌రన్ వేశారు. కిన్నెరసాని పర్యాటక కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. కిన్నెరసాని జలాశయంలో పర్యాటకులు బోటు షికారు చేస్తూ ఆహ్లాదాన్ని పొందుతున్నారు. ఈ నేపథ్యంలో కెనాల్‌లో కూడా తెడ్డు పడవను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ మేరకు నూతనంగా తీసుకొచ్చిన తెడ్డు పడవలో కలెక్టర్ ప్రాజెక్టు నుంచి పర్యాటక కేంద్రం ముఖద్వారం వరకు ప్రయాణించారు. నలుగురు కూర్చునే విధంగా ఈ తెడ్డు పడవను ఏర్పాటు చేశారు. పర్యాటకులు కిన్నెరసాని జలాశయంలోనే కాకుండా కెనాల్‌లో కూడా పర్యటించాలని కోరారు. అనంతరం జలాశయం అధికారులతో మాట్లాడారు. పర్యాటక కేంద్రం అభివృద్ధిపై చర్చించారు. కలెక్టర్ వెంట ప్రాజెక్టు ఏడీ రామకృష్ణ, ఫారెస్ట్ సిబ్బంది ఉన్నారు.

ఈ అంధుడికి దిక్కెవరు?



- ఎండ, వాన, చలితో సహజీవనం
- ఓ ప్రమాదంలో కళ్లు పోగొట్టుకున్న కల్లూరు వాసి గఫార్
- నివాస స్థావరం కల్పించి ఆదుకోవాలని ప్రభుత్వానికి వేడుకోలు

కల్లూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) కల్లూరులో ఓ అంధుడు దిక్కుమొక్కు లేకపోవడంతో వీధినే నివాసంగా ఎంచుకోన్నాడు. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన గఫార్ జీవనం కోసం 15ఏళ్ల క్రితం లారీ డ్రైవింగ్ నేర్చుకునేందుకు ముందుగా క్లీనర్‌గా చేరాడు. ఓసారి లారీకి మరమ్మతులు చేస్తున్న క్రమంలో టైర్లను విప్పేందుకు జాకీ బిగుస్తుంగా అది తల భాగంలో బలంగా తగిలింది. దీంతో నరాలు దెబ్బతిన్నాయి. కళ్లు కనిపించకపోవడంతో ఆపరేషన్ చేయించినా.. ఫలితం లేక చూపు కోల్పోయాడు. ఇలా కుటుంబ తరపున ఎవరు ఆధారం లేకపోవంటంతో గఫార్ జీవనం ప్రశ్నార్థకంగా మారింది. కుటుంబ సభ్యుల్లో సోదరులు కూడ పేదవారు కావటంతో నివాస స్థావరం లేక గత పదిహేను ఏళ్లనుంచి నుంచి స్థానికంగా మెయిన్ సెంటర్ సమీపంలో యూపీఎస్ రహదారి వైపున గల షాపింగ్ కాంప్లెక్స్ ముందు గల ప్రదేశాన్ని స్థావరంగా ఏర్పాటు చేసుకోని జీవనం సాగిస్తున్నాడు. ఆరు బయట నిద్రిస్తూ ఉంటాడు. ఓ ప్రభుత్వ పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎండి మగ్బూల్ సహకారంతో పదోతరగతి వరకు చదివాడు. ప్రభుత్వం అందించే ఆసరా పెన్షన్ రూ.4వేలతో జీవన అవసరాలను తీర్చుకుంటున్నాడు. అంధుడైన తనకు ప్రభుత్వం ఇల్లు ఇచ్చి ఆదుకోవాలని ఉన్నతాధికారులను, పాలకులను వేడుకుంటున్నాడు.

రోడ్డెక్కిన అయ్యప్ప దీక్షదారులు

- అయ్యప్ప ఆలయం ఎదుట బైఠాయింపు...
- జాతీయ రహదారిపై నిరసన తెలిపిన అయ్యప్ప దీక్షదారులు

పాల్వంచ, నవంబరు 16 ఆంధ్రజ్యోతి: అయ్యప్పదీక్షదారులు శనివారం రోడ్డెక్కారు. తామునూతన కమిటీని ఏర్పాటు చేసుకుని రిజిస్ట్రేషన్ చేయించుకున్నామని, గుడి ప్రాంగణంలో ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీని పాత కమిటీ వారే చింపివేసారని ఆరోపిస్తూ అయ్యప్ప దీక్షదారులు గుడి ఎదుట బైఠాయించారు. పాల్వంచ అయ్యప్ప దేవాలయంలో భక్తులు గత తొమ్మిది సంవత్సరాలుగా సమర్పించే కానుకలకు లెక్కలు చెప్పాలని, పాత కమిటీని రద్దు చేసి అందరి సమక్షంలో నూతన కమిటీని ఏర్పాటుచేయాలని డిమాండ్ చేస్తూ అయ్యప్ప దీక్షదారులు నిరసన చేపట్టారు. దేవాలయం ఎదుట బైఠాయించి పాత కమిటీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం జాతీయ రహదారిపై కొద్దిసేపు నిరసన తెలిపారు. దీంతో జాతీయరహదారిపై రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. గత తొమ్మిది సంవత్సరాలుగా పాత కమిటీ సభ్యులు వారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, విరాళాలకు లెక్కా, పత్రాలు లేకుండా చేశారని, మిగులు ఆదాయంలో ఉండాల్సిన దేవాలయాన్ని నైవేద్యానికి సైతం డబ్బులు లేని పరిస్థితికి తీసుకొచ్చారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. అనంతరం ఇరువర్గాల వారు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు.

పత్తి కొనుగోళ్లలో మోసం

తూకాల్లో వ్యాపారుల చేతివాటం.. ఏన్కూరు ఏఎంసీ రైతుల ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న రైతులు

ఏన్కూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ ఎదుట పత్తి రైతులు ధర్నా చేశారు. ప్రైవేటు తూకాల ద్వారా కొనుగోలు చేస్తూ, తక్కువ తూకం చూపుతున్నారని , క్వింటాకు ఎక్కువగా దారం తీస్తూ ట్రేడర్లు, రైతులను మోసగిస్తున్నారని ఆరోపిస్తూ మార్కెట్ యార్డు గేటుకు తాళం వేసి ఆందోళన చేశారు. శనివారం గార్లొడ్డు గ్రామానికి చెందిన పాకాలపాటి నరేష్ ట్రాలీ ఆటోలో పత్తి తీసుకొచ్చాడు. ట్రేడర్లు సూచించిన కాటాలో తూకం వేయగా 19.50 క్వింటాళ్లు వచ్చింది. అనుమానంతో రైతు మరొక దగ్గర కాంటా వేయించగా 20కిలోల తేడా వచ్చింది. దీంతో రైతులు ఆందోళనకు దిగారు.

ట్రేడర్లకు రైతులకు మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. తమకు న్యాయం జరిగే వరకు కదిలేది లేదంటూ మార్కెట్ యార్డు గేటుఎదుట గార్లొడ్డు గ్రామానికి చెందిన రైతులు పాకాలపాటి నరేష్, పటాన్‌మజీద్‌ఖాన్, దడిపల్లి నరసింహారావు, తోట బాబు, మందడపు శ్రీను, గోరంట్ల నరసింహారావు, తోట నరసింహారావు, దరావత్ రవి, దరావత్ రమణ ఆందోలన చేశారు. అనంతరం తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు, ఎస్‌ఐ రఫీకి ఫిర్యాదు చేశారు. రైతుల ఫిర్యాదు మేరకు సీఐ ముత్తులింగం మార్కెట్ యార్డును సందర్శించారు. వేబ్రిడ్జిదారులతో మాట్లాడారు. అనంతరం రైతులతో మాట్లాడి ఫిర్యాదులను స్వీకరించారు. రైతులకు తూకాల్లో ఎటువంటి మోసాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఏఎంసీ కార్యదర్శి బజారును సీఐ ఆదేశించారు. ఈ విషయమై ఏ ఎంసీ కార్యదర్శి బజార్‌ను వివరణ కోరగా తూనికలు, కొలతలు టెక్నీషియన్లు ప్రైవేటు కాంటాలను పరిశీలించారన్నారు. రిపోర్టు రాగానే తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. మార్కెట్ యార్డులోని కాంటా ద్వారానే ప్రసుత్తం కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. రైతులకు ఇబ్బంది కలగకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు.

గ్రూప్-3 పరీక్షలకు సర్వం సిద్ధం

(5వ పేజీ తరువాయి)

ఎలక్ట్రానిక్ గాడ్జెట్ మొదలగు సామగ్రిని అనుమతించేది లేదన్నారు. అభ్యర్థులు చెప్పులు మాత్రమే వేసుకోవాలని తెలిపారు. అదనపు కలెక్టర్ తనిఖీల సందర్భంగా చీఫ్ సూపరింటెండెంట్లు స్టీఫెన్, పుల్లారావు, కిరణ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు. కాగా భద్రాద్రి జిల్లావ్యాప్తంగా 39 పరీక్షా కేంద్రాల్లో 13,478 అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. కొత్తగూడెంలో 26 పరీక్షా కేంద్రాలు, పాల్వంచలో 13 పరీక్షా కేంద్రాలతో కలిపి మొత్తం 39 పరీక్షా కేంద్రాలకు 39మంది చీఫ్ సూపరింటెండెంట్‌లను జిల్లా కలెక్టర్ జితేష్ విపాటిల్ నియమించారు. అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు హాజరుకావాలని, సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ లాగ్ టేబుల్స్, బ్యాగులు నిషేధించామని.. బయో మెట్రిక్ హాజరు విధానం వల్ల మోహందీ, టాటూల్ పెట్టుకోవద్దని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ 350 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశారు. 17వ తేదిన ఉదయం 10 గంటల నుంచి 12.30గంటల వరకు మధ్యాహ్నం 3గంటల నుంచి 5.30గంటల వరకు పరీక్షా సమయం నిర్ణయించారు. పరీక్షలు వ్రాసేందుకు అభ్యర్థులు ఉదయం 9.30 గంటలకు మధ్యాహ్నం 2.30గంటల లోపు హాజరుకావాల్సి ఉంది.

21న స్పోర్ట్స్ కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

ఖమ్మం ఖానాపురంహవేలి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2024లో స్పోర్ట్స్ కేటగిరి కింద ఉపాధ్యాయుల నియామకం కోసం అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఈ నెల 21న హైదరాబాదులో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ తెలిపారు. హైదరాబాదులోని దోమలగూడలో ఉన్న ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాకు చెందిన 21 మంది అభ్యర్థులు ఈ సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కావాలని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తామని డీఈవో తెలిపారు. అభ్యర్థులకు ఫోన్ ద్వారా సమాచారం అందించామన్నారు. సంబంధిత అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక జత అటెస్టెడ్ జిరాక్స్ కాపీలతో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కావాలని కోరారు.



కూరగాయల సాగు లాభాలు బాగు

- మండలంలో 398 ఎకరాల విస్తీర్ణంలో కూరగాయల సాగు
- ఖమ్మంనగరానికి కూరగాయలు అందిస్తున్న రఘునాథపాలెం

ఖమ్మం సంక్షేమవిభాగం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సాంప్రదాయ వ్యవసాయ పంటల సాగుతో నష్టాలు రావటంతో రఘునాథపాలెం మండలంలోని రైతులు కూరగాయల సాగుపై గత పదేళ్లుగా దృష్టి సారించారు. ఖమ్మంనగరం సమీపంలోనే ఉండటంతో కూరగాయల అమ్మకానికి అనువుగా మారింది. ఇప్పుడు మండలంలోని ప్రతి గ్రామంలోనూ కూరగాయల సాగు పెరిగింది. అన్ని రకాల కూరగాయలను సాగు చేస్తూ ఏడాదికి మూడు పంటలను పండిస్తూ కూరగాయల సాగు.. లాభాలు బాగూ.. అంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు మండల రైతులు..

398 ఎకరాల విస్తీర్ణంలో

రఘునాథపాలెం మండలంలోని 40 గ్రామ పంచాయతీల్లోనూ కూరగాయల సాగును రైతులు పండిస్తున్నారు. ఒక్కో రైతు ఎకరం నుంచి ఐదెకరాల వరకు భూ విస్తీర్ణంలో అనేక రకాల కూరగాయల్ని సాగు చేస్తున్నారు. ఉద్యానవనశాఖ లెక్కల మేరకు ఈ ఏడాది ఇప్పటివరకు 398ఎకరాల్లో కూరగాయల సాగు ప్రారంభమైంది. టమాట115, బెండ 61, దోస 48, చిక్కుడు 60, వంగ 39, వీటితో పాటుగా ఆకు కూరలు సాగు చేస్తున్నారు. ఖమ్మం నగరంలోని ప్రధానమైన రైతు బజార్లు నుంచి వీధి వ్యాపారుల వరకు రఘునాథపాలెం రైతు కుటుంబాలే అధికంగా ఉంటున్నాయి. తాము పండించిన కూరగాయల్ని నేరుగా రైతు బజార్లలో అమ్మకాలు జరుపుతూ అధిక లాభాలను పొందుతున్నారు.

ఆధునిక వ్యవసాయ విధానాలతో..

కూరగాయల సాగులో తక్కువ వ్యయం, ఎక్కువ ఆదాయం వచ్చేలా ఆధునిక వ్యవసాయ విధానాలను అమలు చేస్తున్నారు. కూరగాయలకు శాశ్వత పందిళ్లు, మల్చింగ్ విధానం, హైబ్రీడ్ విత్తనాల వినియోగం, నాణ్యమైన నారు వినియోగం చేస్తున్నారు. అలాగే ఎప్పటికప్పుడు ఉద్యానవన అధికారులతో రైతులు సంప్రదించి ప్రభుత్వం అందించే సబ్సిడీలు, ప్రోత్సాహకాలను తెలుసుకొని వాటి లబ్ధిపొందుతున్నారు.





రైతులకు ఇబ్బందుల్లేకుండా
ధాన్యం కొనుగోలు చేయాలి

సివిల్ సప్లయీస్ డీఎం శ్రీలత

వేంసూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సివిల్ సప్లయి డీఎం శ్రీలత సిబ్బందిని ఆదేశించారు. శనివారం మర్లపాడులో సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ధాన్యంలో కొత్త తెలుపు వస్తుందని మిల్లర్లు పెండింగ్ పెట్టారని లచ్చన్నగూడెం సీఈవో గోపిరాజు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. అలాగే తూర్పారపట్టడం కష్టంగా ఉందని పలువురు రైతులు ఆమెకు వివరించారు. అనంతరం ఆమె మిల్లర్లు, వ్యవసాయశాఖ అధికారులతో మాట్లాడి రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఆర్ఐ శ్రీనివాస్, సొసైటీ సీఈవోలు వీరభద్రరావు, వెంకటేశ్వరరావు, చెన్నారెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వరి కోతలకు
యంత్రాల కొరత

ఖమ్మం వ్యవసాయం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో వరి కోత యంత్రాల కొరత నెలకొంది. గతంలో వరి కోతలు అన్నీ ఒకేసారి వచ్చేవికాదు. దీంతో ఒకరి పొలం తర్వాత మరొకరి పొలం కోసేందుకు యంత్రాలకు అవకాశం ఉండేది. తక్కువ స్థాయిలో యంత్రాలు ఉన్నప్పటికీ రైతులకు ఇబ్బందులు ఉండేవి కావు. పరిస్థితులు మారిపోయాయి. అకాల వర్షాల భయంతో రైతులు గతానికి భిన్నంగా అందరూ ఒకేసారి సాగు చేస్తూ కోతలకు ఉపక్రమిస్తుండటంతో యంత్రాలు లభ్యం కావడం లేదు. ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం యంత్రాల సంఖ్య పెరిగినా అందరూ ఒకసారి కోత పనులు ప్రారంభిస్తూ యంత్రాల కోసం ప్రయత్నిస్తున్నారు. అడ్వాన్స్ డబ్బులు ఇచ్చేందుకు కూడా సిద్ధం అవుతున్నారు. పలు ప్రాంతాలలో ఆకాశం మేఘావృతం అవుతుండటంతో వరి కోసేందుకు పొలాలను ఆరబెట్టి యంత్రాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. సకాలంలో యంత్రాలు దొరకవేమోనని ఆందోళన చెందుతున్నారు. వీటన్నింటి నేపథ్యంలో ఎంత తొందరగా వరి కోతలను పూర్తి చేస్తే అంత మంచిదనే భావనలో రైతుల యంత్రాల కోసం ఎగబడుతున్నారు.

గత సంవత్సరం వరి కోతకు గంటకు రైతులు హార్వెస్టర్లకు రూ.2400 వరకు అందజేశారు. ఈ సంవత్సరం యంత్రాల యజమానులు ధరలు పెంచారు. రూ.2500 నుంచి రూ.2800 వరకు వసూలు చేస్తున్నారు. ఈ రేటును ఇచ్చేందుకు రైతులు సిద్ధంగా ఉన్నా.. యంత్రాలు మాత్రం లభ్యం కావడం లేదు. దీనిపై రైతులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. అయితే ఒక పక్షం రోజులు ఇలా డిమాండ్ ఉంటుందని, తర్వాత అంతా మామూలుగానే ఉంటుందని రైతులు అంటున్నారు.



డాలర్ డ్రీమ్స్!

(5వ పేజీ తరువాయి)

నిర్ణయాలకు ఒక్కొక్కరు ఒక్కో కారణాన్ని తెలిపారు. వాటిల్లో ముఖ్యంగా విదేశాల్లో ఉపాధి అవకాశాలు బాగున్నాయన్న అభిప్రాయాలను వ్యక్తపరుస్తున్నారు. ఇక్కడ చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగం కోసం వేచి చూడాల్సి వస్తుందనీ కారణంగా తల్లిదండ్రులపై ఆధారపడాల్సి వస్తుందనీ, వారికి ఆర్థిక భారంగా మారాల్సి వస్తుందని పేర్కొన్నారు. విదేశాల్లో అయితే చదువుతోపాటు ఉద్యోగం కూడా చేసుకోవచ్చంటున్నారు. అక్కడ వేతన సరళి కూడా గంటలచొప్పున ఉంటుందనీ, అక్కడ పనిచేస్తూ చదువుకోవడం ద్వారా ఇక్కడి తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడదని చెప్పుకొచ్చారు. మరికొందరు విదేశీ డిగ్రీకి విలువ ఉందని భావించి అక్కడకు వెళ్తున్నట్టు చెప్పగా.. అక్కడ డిగ్రీ పూర్తి చేసిన తర్వాత ఎక్కువ మొత్తంలో ప్యాకేజీలు లభిస్తాయనీ, ఒకవేళ అక్కడినుంచి తిరిగి వచ్చినప్పటికీ ఇక్కడ దేశంలో అత్యధిక శాలరీలతో కంపెనీలు ఆఫర్లు ఇస్తాయన్న అభిప్రాయం యువతలో ఉన్నట్టు వెల్లడైంది. ఇంకొంతమంది యువత ఇక్కడ ఉద్యోగ అవకాశాలు లభించడంలేదన్న ఉద్దేశంతో విదేశాలకు వెళ్తున్నట్టుగా అభిప్రాయపడ్డారు. కాగా వారందరూ తెలిపిన కారణాలకు మూలం మాత్రం డబ్బులు సంపాదనే కనిపిస్తోంది. తద్వారా తమ, కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగుపర్చుకోవాలన్నదే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్టుగా తెలుస్తోంది.

సొంత నిర్ణయంతోనే..

యువత మాత్రం ఇక్కడి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని చదువుకోవాలని విదేశాలకు వెళ్తున్నామనీ చెప్పడంలో భాగంగా అక్కడకు వెళ్లడం సొంతనిర్ణయంగానే అభిప్రాయ పడుతున్నారు. అత్యధిక శాతం మంది తమ సొంత నిర్ణయం తీసుకోగా.. తల్లిదండ్రుల సహకారంతో విదేశాలకు పయనమవుతున్నట్టుగా చెబుతున్నారు. ఆ తర్వాత స్థానంలో తల్లిదండ్రులు, స్నేహితుల ప్రేరణతో ముందుకు సాగిన వారున్నారు. ఇక అక్కడకు వెళ్లిన వారు తిరిగి ఎప్పుడొస్తారన్న ప్రశ్నకు మాత్రం మిశ్రమంగా సమాధానాలు లభించాయి. చదువు పూర్తయిన తర్వాత కొద్ది రోజులకు ఆర్థికంగా బలోపేతం అయ్యి తిరిగి వస్తామనే వారు అధికంగా ఉండగా.. ఆ తర్వాత స్థానంలో అక్కడే సెటిల్ అయిపోతామన్న అభిప్రాయం చెప్పిన వారున్నారు. వెంటనే తిరిగి వస్తామని చాలా తక్కువ శాతం అభిప్రాయాలు వెలువడగా.. ఆర్థిక పరిస్థితి మెరుగుపరుచుకోవాలనుకోవడమే వారి అంతిమ లక్ష్యమని స్పష్టమవుతోంది. అక్కడకు వెళ్లేందుకు ప్రభుత్వ సహకారం బాగుందన్న అభిప్రాయాలే అధికంగా ఉన్నాయి. వెళ్లేవారి ఆర్థిక పరిస్థితి సహకరించని పక్షంలో వారికి ప్రభుత్వరంగ బ్యాంకులే భరోసాగా నిలిచినట్టు అత్యధిక శాతం మంది అభిప్రాయపడ్డారు.

కష్టానికి తగిన ప్రతిఫలం

గోపీచంద్, లచ్చగూడెం

మన దేశంలో, అమెరికాలో పని గంటలు సమానంగానే ఉంటాయి. కానీ వేతనాలు వత్రరం మనకంటే కూడా విదేశాల్లో ఎక్కువగా ఉంటాయి. కష్టానికి తగ్గ ప్రతి ఫలం అమెరికాలో ఎక్కువ ఉంటుంది. అగ్రరాజ్యంలో ఉంటున్నామనే ధీమా కూడా ఉంటుంది అందువల్ల అక్కడే ఉండేందుకు మక్కువ చూపుతా.

సహకారం ఉంటే రాణిస్తారు

కుంజా ప్రవళ్లిక, పగిడేరు

మన దేశంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం కొన్ని కోట్ల మంది వేచి చూస్తున్నారు. ఆర్థికంగా వెనుకబడిన వారు, డబ్బులేని వారు, అవగాహన లేనివారు చాలామంది టాలెంట్ ఉన్నప్పటికీ విదేశాలకు వెళ్లలేక పోతున్నారు. తల్లిదండ్రులతో పాటు ప్రభుత్వం సహకారం ఉంటే మనదేశంలోని యువత చాలా మంది ప్రపంచ దేశాలలో చదువుకుని ఉన్నత స్థాయికి వెళ్లగలరు.

ఎక్కువ ప్యాకేజీలు ఉంటాయి

శీలం వినయ్‌రెడ్డి, శ్రీరామ్ హిల్స్, ఖమ్మం

బీటెక్ పూర్తయి ఎంఎస్ కోసం విదేశాలకు వెళ్లాలని నిర్ణయించుకున్నా. అక్కడ ప్యాకేజీలు ఎక్కువగా ఉంటాయి. ఇక్కడ జీవితాంతం చేసే ఉద్యోగం.. అక్కడ కొన్నేళ్లపాటు చేసే ఉద్యోగంతో సమానం. అక్కడి ప్యాకేజీని బట్టి అక్కడే స్థిరపడాలా? లేదా? అన్న విషయంపై నిర్ణయం తీసుకుంటా.

చదువు పూర్తయిన వెంటనే ఉద్యోగం

చెరుకూరి సంతోష్, ఖమ్మం

విదేశాల్లో చదువు పూర్తయిన వెంటనే ఉద్యోగం వస్తుంది. మన దేశంలో చదువు అనంతరం ఎన్ని సంవత్సరాలైనా ఉద్యోగం రావటం కష్టంగా మారింది. ఇండియన్ కరెన్సీతో పోల్చుకుంటే అక్కడ చేసే ఉద్యోగానికి తగ్గట్టుగా డబ్బులు కూడా అధికంగానే వస్తాయి. అందుకనే అక్కడకు వెళ్లాలని నిర్ణయించుకున్నా.

తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గుతుంది

గూడూరు పల్లవి, తక్కెళ్ళపాడు, ఎర్రుపాలెం మండలం

విదేశాల్లో చదువు తోపాటు ఉపాధి లభిస్తుంది. చదువుకుంటూనే పార్ట్ టైమ్ జాబ్ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. మా ఫీజులు, ఖర్చులు కూడా మేమే సంపాదించుకోగలుగుతాం. దానివల్ల తల్లితండ్రులకు కొంత ఆర్థిక భారం తగ్గుతుంది. మన దేశంలో ఉద్యోగం వచ్చేంత వరకు తల్లితండ్రులే ఆర్థికంగా ఆదుకోవాల్సి వస్తుంది.

కుటుంబాన్ని ఆర్థికంగా నిలబెట్టాలి

ఎమ్డీ ఉస్మాన్, కొత్తగూడెం

ఉపాధి అవకాశాలు బాగుంటాయన్న ఉద్దేశ్యంతో విదేశాలకు వెళ్ళేందుకు సిద్ధమవుతున్నాను. మాకు తెలిసిన బంధువులు అక్కడ ఉండడంతో నాకు ఆలోచన కలిగింది. మాది నిరుపేద కుటుంబం. తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించుకొని ఆర్థికంగా స్థిరపడవచ్చు. విద్య పూర్తయిన అనంతరం మంచి ప్యాకేజీ లభిస్తే అక్కడే ఉండి పోతాను.

ఆరు గ్యారెంటీల అమలులో
కాంగ్రెస్ విఫలం

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గత లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ, బీఆర్ఎస్ వ్యతిరేక శక్తులపై పోరాటం నినాదంతో పరోక్షంగా కాంగ్రెస్ గెలుపుకు కారణమైన సీపీఐ(ఎంఎల్)మాస్ లైన్ రాష్ట్ర కమిటీ.. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వంపైనే పోరు బాటకు కార్యచరణ చేసింది. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయటంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం చెందిందని అందుకే 11నెలల కాలం ఇచ్చిన తర్వాతనే ఉద్యమ కార్యచరణ చేస్తున్నామని క్యాడర్‌కు రాష్ట్ర కమిటీ సంకేతాలు పంపింది. ఈనెల 14, 15, 16న ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ అంతర్గత సమావేశాలు నిర్వహించారు. పలు కీలకమైన రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జిల్లా కమిటీ సభ్యుడు ఆవుల అశోక్ అధ్యక్షతన నిర్వహించిన విలేకర్ల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మాట్లాడారు. ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయటంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం చెందిందని అందుకే ఏడాది పాటు గడువు ఇచ్చి ఇప్పుడు ప్రజల పక్షాన పోరాటాలు చేస్తున్నామని రాష్ట్ర కమిటీ నిర్ణయాలను ప్రకటించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావటంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం చెందిందని ఆరోపించారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు కేజీ రామచందర్, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, కే రమ, చంద్ర అరుణ, కెచ్చెల రంగయ్య, గోకినపల్లి వెంకటేశ్వరరావు, చిన్న చంద్రన్న, వీ కృష్ణ, వీ ప్రభాకర్, సదానందం, కె.సూర్యం, ఎం.కృష్ణ, గుర్రం అచ్చయ్య పాల్గొన్నారు.

క్రమశిక్షణ పేరుతో గుండు కొట్టించాడు..

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఓ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఓవర్ యాక్షన్ వివాదానికి దారి తీసింది. విద్యార్థుల పట్ల సంయమనానికి బదులు, క్రమశిక్షణ పేరుతో దూకుడుగా వ్యవహరించడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న ఓ మెడికోకు అసిస్టెంట్ ప్రొఫెసర్ గుండుకొట్టించాడు. ఈ సంఘటనను ఉన్నతాధికారులు గోప్యంగా ఉంచినా సోషల్ మీడియా ద్వారా బయటకు పొక్కింది. దీంతో అధికారులు విచారణ చేపట్టారు. ములుగు జిల్లాకు చెందిన ఓ విద్యార్థి ఈ ఏడాది ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో చేరాడు. మెడికల్ కళాశాలలో హస్టల్‌లో ఉంటూ కాలేజీకి వెళ్తున్నాడు.. ఈనెల 12 రాత్రి ఆ విద్యార్థి చైనీస్ స్టైల్‌లో కటింగ్ చేయించుకుని హాస్టల్‌కి వచ్చాడు. ఆ కటింగ్ చూసిన రెండో సంవత్సరం విద్యార్థులు మెడికల్ కళాశాల విద్యార్థులు ఇలా ఉండటం బాగాలేదని చెప్పడంతో తిరిగి వెళ్లి ట్రిమ్మింగ్ చేయించుకుని వచ్చాడు. హాస్టల్‌లో యాంటీ రాగింగ్ మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్... విద్యార్థి కటింగ్ విషయాన్ని తెలుసుకుని కోపోద్రిక్తుడయ్యాడు. బయటికి తీసుకెళ్లి సెలూన్ షాప్‌లో గుండు గీయించినట్లు తెలిసింది.

విద్యార్థి ఫిర్యాదు

తీవ్ర మనస్థాపానికి గురైన సదరు మెడికో అదే రాత్రి ప్రిన్సిపాల్‌కు అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై ఫిర్యాదు చేశాడు. జరిగిన విషయం వాట్సప్ గ్రూపులో ఫిర్యాదు రావడంతో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా యాంటీ రాగింగ్ మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను 13న అక్కడి నుంచి తప్పించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు తెలిపారు. ఈ ఘటనపై నివేదికను డీఎంఈకి పంపించనున్నట్లు తెలిపారు. ఘటన నిజమేనని, బాధ్యుడిని తొలగించినట్లు ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు.

విచారణకు త్రీ మెన్ కమిటీ

విద్యార్థికి గుండు కొట్టించిన సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సరిత, అనస్తీషియా డాక్టర్ రవి, డాక్టర్ రాజీవ్‌ను విచారణ అధికారులుగా నియమించినట్లు తెలిపారు. మూడు రోజుల్లో వీరు ఈ సంఘటనపై విచారించి నివేదిక అందించాలని సూచించినట్లు తెలిపారు.

విద్యార్థి అంగీకారంతోనే..

మొదటి, ద్వితీయ సంవత్సర విద్యార్థుల మధ్య ఘర్షణ నేపథ్యంలో సదరు మెడికో విద్యార్థి హెయిర్ స్టైల్‌పై ద్వితీయ సంవత్సరం విద్యార్థులు తన దృష్టికి తీసుకొచ్చారని అసిస్టెంట్ ప్రొఫెసర్ చెబుతున్నాడు. మొదటి సంవత్సరానికి చెందిన మెడికోను, ద్వితీయ సంవత్సర విద్యార్థులను కూర్చోబెట్టి ఇరువురికి కౌన్సెలింగ్ నిర్వహించిన అనంతరం విద్యార్థి అంగీకారంతోనే సెలూన్‌కు తీసుకెళ్లినట్టు తెలిపారు.

వచ్చేనెల 16 నుంచి ధనుర్మాసోత్సవాలు

భద్రాచలం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో మార్గశిర మాసంలో నిర్వహించే వివిధ ఉత్సవాల వివరాలను దేవస్థానం అధికారులు వెల్లడించారు. డిసెంబరు 6న శ్రీ రాజా తూము లక్ష్మీనరసింహ దాసు 234వ జయంతి నిర్వహించనున్నారు. 9 నుంచి 13 వరకు తిరుమంగై ఆళ్వార్‌కు తిరునక్షత్రోత్సవాలు నిర్వహించనున్నారు. 15న చొక్కాసుర దహనం నిర్వహించనుండగా 16 నుంచి ధనుర్మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 17న శ్రీరామ పునర్వసు దీక్షల విరమణ, భద్రగిరి ప్రదక్షిణ, 18న శ్రీ సీతారామచంద్రస్వామివారికి పట్టాభిషేకం నిర్వహించనున్నారు. అలాగే 24న ఆండాళ్లమ్మవారికి తిరువీధి సేవ, 25న సుదర్శన హోమం నిర్వహించనున్నారు.

23న దివ్యాంగుల క్రీడలు

ఖమ్మం, ఖానాపురంహవేలి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో ఈనెల 3న దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహిస్తామని జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్ రెడ్డి శనివారం తెలిపారు. అంధులకు పరుగు పందెం, షాట్ పుట్, చెస్ పోటీలు, శారీరక వికలాంగులకు మూడు చక్రాల సైకిల్ తో పరుగు పందెం, షాట్ పుట్, క్యారంబోర్డ్, మానసిక వికలాంగులకు, బధిరులకు పరుగు పందెం, షాట్ పుట్, క్యారం బోర్డ్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 10 నుంచి 17 సంవత్సరాలలోపు వయస్సు గల వారికి జూనియర్ కేటగిరీలో, 18 నుంచి 54 సంవత్సరాల వయస్సు గల వారికి సీనియర్ క్యాటగిరిలో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల వారు 23వ తేదీన ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంకు సదరం సర్టిఫికెట్‌తో హాజరు కావాలని తెలిపారు.

గిరిజనుల గుడిసెల తొలగింపు

- గిరిజనులు, అటవీశాఖ అధికారుల మధ్య వాగ్వాదం
- రెవెన్యూ భూమి అంటున్న గ్రామస్థులు
- నిబంధనలు అంగీకరించవంటున్న ఫారెస్టు సిబ్బంది



గుడిసెలు వేసిన స్థలం వద్ద గిరిజనులు కదలకుండా చుట్టూ మోహరించిన అటవీ సిబ్బంది

అశ్వారావుపేట రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని వినాయకపురం సమీపంలోని ఎర్రగుంటపల్లి వద్ద గిరిజనులు, అటవీశాఖ అధికారుల మధ్య శనివారం తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. అటవీభూమిలో గిరిజనులు నివాసానికి గుడిసెలు వేసుకోగా అటవీశాఖ అధికారులు వాటిని తొలగించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

మండలంలోని మామిళ్లవారిగూడెం బీట్‌లో ఎర్రగుంటపల్లి సమీపంలో సమీప గ్రామాలకు చెందిన దాదాపు 150 మంది గిరిజనులు శుక్రవారం గుడిసెలు వేసుకున్నారు

. గత రెండు ఏళ్లుగా ఇక్కడి భూమిపై వివాదం జరుగుతూనే ఉంది. మాస్‌లైన్ ఆధ్వర్యంలో గతంలోనూ గుడిసెలు వేయగా అధికారులు తొలిగించారు. శుక్రవారం గిరిజనులు గుడిసెలు వేసి రాత్రి దాదాపు ఇరవై మంది వరకు అక్కడే పడుకున్నారు.

సమాచారం అందుకున్న దమ్మపేట, అశ్వారావుపేట రేంజ్‌లకు చెందిన దాదాపు యాభై మంది వరకు అటవీ సిబ్బంది ఉదయం ఏడున్నర ప్రాంతంలో గుడిసెలను తొలగించారు. అక్కడే ఉన్న ఐదుగురు వ్యక్తులను, మూడు ద్విచక్ర వాహనాలను రేంజ్ కార్యాలయానికి తరలించారు. గుడిసెల తొలిగింపు విషయం తెలుసుకున్న గిరిజనులు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకుని రోడ్డుపై ఆందోళనకు దిగారు. నిబంధనల ప్రకారం అటవీభూమిలో గుడిసెలు వేయటం కుదరదని అధికారులు తెలపటంతో నినాదాలు చేశారు. గుడిసెలు వేసిన ప్రాంతంలో తాము హద్దులు వేస్తామని, తమ భూమి కాకుండా వేరే భూమి ఉంటే అక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

సాయంత్రం వరకు గిరిజనులు అక్కడే ఉన్నారు. అధికారులు తీసుకెళ్లిన ఐదుగురిని విడిచిపెట్టాలని డిమాండ్ చేశారు. గిరిజనులను విడిచి పెడతామని హామీ ఇవ్వటంతో గిరిజనులు అక్కడ నుంచి వెళ్లిపోయారు.

'శాంతిభద్రతల సమస్య సృష్టిస్తున్న బీఆర్‌ఎస్'



మాట్లాడుతున్న పువ్వాళ్ల, రాయల

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ నాయకులు శాంతిభద్రతల సమస్యలను సృష్టించేందుకు అధికారులపై దాడులు చేస్తున్నారని, కాంగ్రెస్ పదేళ్ల ప్రతిపక్షంలో ఇటువంటి రాజకీయాలు చేయలేదని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. లగచర్ల వివాదంపై స్పందించారు. అధికారయంత్రాంగంపై బీఆర్‌ఎస్ నాయకులు దాడులు చేస్తే అందుకు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్సీ పొట్ల నాగేశ్వరరావు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం, బొడ్డు బొందయ్య, మొక్కా శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

'ఉపాధి' పనులను వేగవంతం చేయాలి

రఘునాథపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో ఇతర శాఖల సమన్వయంతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని డీఆర్డీవో సన్యాసయ్య కోరారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రభుత్వశాఖల సమీక్షలో పెండింగ్‌లో ఉన్న పనులపై సమీక్షించారు. ఎంపీడీవో అశోక్, ఏపీవో, ఇతరశాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



పరుగు పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

రెండో రోజూ హోరాహోరీ

- ఉత్సాహంగా రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో గత రెండు రోజులుగా జరుగుతున్న 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) అండర్- 14 బాలుర, బాలికల రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. శనివారం 100, 400మీటర్ల పరుగు, డిస్కస్‌త్రో, హైజంప్, లాంగ్‌జంప్, 4100 మీటర్ల రిలే విభాగాలలో పోటీలు నిర్వహించారు. రాష్ట్ర పోటీలలో ప్రతిభ చూపిన క్రీడాకారులను త్వరలో జాతీయస్థాయి పోటీలలో పాల్గొనే తెలంగాణా రాష్ట్ర జట్టుకు ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలను డీఈవో సోమశేఖరశర్మ, డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి, రాష్ట్ర ఎస్‌జీఎఫ్ అబ్జర్వర్ సోమశేఖర్, అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సారంగపాణి, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ నర్సింహమూర్తి సమీక్షించారు.



షాట్‌పుట్ విసురుతున్న బాలిక

రెండో రోజు విజేతలు వీరే

బాలుర విభాగంలో.. 100 మీటర్ల పరుగు పోటీలో కార్తీక్(ఆదిలాబాద్) ప్రథమ, ప్రవీణ్(నల్గొండ) ద్వితీయ, బాచీ(వరంగల్) తృతీయ స్థానాల్లో నిలిచారు. 400 మీటర్ల పరుగు పోటీలో సాయిఆదిత్య (రంగారెడ్డి) ప్రథమ, నగేష్(ఆదిలాబాద్) ద్వితీయ, జాకేష్(ఆదిలాబాద్) తృతీయ స్థానాల్లో నిలిచారు. హైజంప్‌లో శ్రీకాంత్(మెదక్) ప్రథమ, దిల్షన్ (మహబూబ్‌నగర్) ద్వితీయ, అఖిల్(రంగారెడ్డి) తృతీయస్థానాల్లో నిలిచారు. లాంగ్‌జంప్‌లో ప్రవీణ్(నల్గొండ) ప్రథమ, దిల్షన్ (మహబూబ్‌నగర్) ద్వితీయ, శ్రీధృతిరెడ్డి(మెదక్) తృతీయస్థానాల్లో నిలిచారు. డిస్కస్‌త్రోలో శ్రీకాంత్(ఆదిలాబాద్) ప్రథమ, ముత్తు (మహబూబ్‌నగర్) ద్వితీయ, శివకుమార్(రంగారెడ్డి) తృతీయస్థానాల్లో నిలిచారు.

బాలికల విభాగంలో.. 100 మీటర్ల పరుగు పోటీలో నక్షత్ర(కరీంనగర్) ప్రథమ, శృతిహాసన్(ఖమ్మం) ద్వితీయ, శైలజ (ఆదిలాబాద్) తృతీయ స్థానాల్లో నిలిచారు.

400 మీటర్ల పరుగు పోటీలో జాహ్నవి(కరీంనగర్) ప్రథమ, రాజేశ్వరి (వరంగల్) ద్వితీయ,. దాన్య (హైదరాబాద్) తృతీయ స్థానాల్లో నిలిచారు. హైజంప్‌లో సహారా(ఆదిలాబాద్) ప్రథమ, సాయిశ్రీ(రంగారెడ్డి) ద్వితీయ, శ్రీధృతిరెడ్డి(మెదక్) తృతీయస్థానాల్లో నిలిచారు. షాట్‌పుట్‌లో వినూత్న(హైదరాబాద్) ప్రథమ, సమంత(వరంగల్) ద్వితీయ, దాన్య(మెదక్) తృతీయస్థానాల్లో నిలిచారు. డిస్కస్‌త్రోలో వినూత్న(హైదరాబాద్) ప్రథమ, దాన్య(మెదక్) ద్వితీయ, మధుప్రియ(ఖమ్మం) తృతీయ స్థానాల్లో నిలిచారు.

టీడీపీ సభ్యత్వాలకు ఆదరణ: కూరపాటి



సభ్యత్వాలను నమోదు చేస్తున్న దృశ్యం

ఖమ్మం మామిళ్లగూడెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వాల నమోదుకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని టీడీపీ జిల్లా నాయకులు కూరపాటి వెంకటేశ్వర్లు తెలిపారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం ఖమ్మం నగరంలోని 2,3,4,5 డివిజన్లో నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణలో భవిష్యత్తులో తెలుగుదేశం పార్టీనే ప్రత్యామ్నాయం కానుందన్నారు. టీడీపీ హయంలో చేసిన సంక్షేమ పథకాలే ప్రస్తుత పాలకులు కొనసాగిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి సభ్యత్వాన్ని అందచేశారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికీ ప్రమాద బీమా రెండు లక్షల నుండి 5 లక్షలకు పెంచినట్లు తెలిపారు. కేవలం 100 రూపాయలతోనే రెండు సంవత్సరాల పాటు ప్రమాద బీమా వర్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుత్తా సీతయ్య, వడ్డెం విజయ్, మేకల సత్యవతి, నాగండ్ల మురళి, గుండెపిన్ని నాగేశ్వరావు, సౌలంలావణ్య, మీగడ రామారావు, కృష్ణమాచారి, యర్నం జేమ్స్, గొర్రెముచ్చు రాజు, తిగుళ్ల రమణ, నిర్మల తదితరులు పాల్గొన్నారు .

ఈశా గ్రామోత్సవం క్రీడలు ప్రారంభం

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఈశా ఫౌండేషన్ గ్రామోత్సవం గ్రామీణ క్రీడా పోటీలు శుక్రవారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. పోటీలను నగర ఏసీపీ సుశీల్‌సింగ్, డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. రెండు రోజులు పాటు నగరంలో జరగనున్న ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా 32 వాలీబాల్ జట్లు, 24 కబడ్డీ జట్లు పాల్గొన్నాయి. నిర్వాహకులు ప్రత్యేకంగా ఓడిన జట్ల కోసం ఫన్ గేమ్స్, కోలాటం తదితర పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈశా నిర్వాహకులు నవీన్, వాలీబాల్ కోచ్ అక్బర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.



హై జంప్ చేస్తున్న క్రీడాకారుడు

హెచ్‌ఎంపై సస్పెన్షన్ వేటు

కొత్తగూడెం అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విధుల పట్ల నిర్లక్ష్యం, రిపోర్టుల సమర్పణలో అలసత్వం, ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తున్న కొత్తగూడెం మునిసిపల్ పరిధిలోని మేదరబస్తీ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఫణిభాస్కర్‌పై జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరచారి సస్పెన్షన్ వేటు వేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్రకుటుంబ సర్వే విధులకు గైర్హాజరు కావడం, అధికారులకు నిర్ణీత సమయంలో సమాచారం ఇవ్వకపోవడం విధుల పట్ల నిర్లక్ష్యవైఖరి ప్రదర్శనపై జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ దృష్టికి వెళ్లడంతో సస్పెన్షన్ వేటు పడింది.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

అశ్వారావుపేట రూరల్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): కుటుంబకలహాల నేపథ్యంలో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నారంవారిగూడెం గ్రామానికి చెందిన పాకనాటి రాజేంద్రప్రసాద్(35) కుటుంబంలో తరచుగా కలహాలు ఏర్పడుతున్నాయి. ఇదే తరుణంలో శుక్రవారం కూడా అతడు భార్య శ్రీలతను మందలించడంతో సమీపంలో నివాసం ఉండే అత్తమామల వద్దకు వెళ్లింది. శుక్రవారం రాత్రి రాజేంద్రప్రసాద్ ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. కాగా శనివారం ఉదయం ఇంట్లో ఉన్న అతడు ఉరేసుకుని ఉండటాన్ని సమీపంలోని వారు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కడుపునొప్పి తాళలేక విద్యార్థిని....

ముదిగొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ముదిగొండ మండలం సువర్ణాపురం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వేల్పుల భార్గవి(16)ముదిగొండలో పదోతరగతి చదువుతుంది. శుక్రవారం రాత్రి విపరీతమైన కడుపునొప్పి రావడంతో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబసభ్యులు గమనించి చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. విద్యార్థిని తండ్రి వెంకయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముదిగొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.6లక్షల విలువైన గంజాయి పట్టివేత

దుమ్ముగూడెం నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మహాదేవపురం గ్రామశివారు ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై ట్రాలీఆటోలో రవాణా జరుగుతున్న రూ.6లక్షల విలువైన గంజాయిను పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ రాష్ట్రం చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లికు చెందిన యనమలగండ్ల సాంబయ్య, భద్రాద్రి జిల్లా అశ్వాపురం గ్రామానికి చెందిన కోడి రాంబాబులు కొంతమందితో కలిసి ఆంధ్రా-ఒడిస్సా సరిహద్దు నుంచి నిషేధిత గంజాయిని కొనుగోలు చేసి, తెలంగాణ ప్రాంతానికి సరఫరా చేస్తున్నారు. పోలీసులు తనఖీలు నిర్వహిస్తున్న క్రమంలో వీరి వద్ద నుంచి 26.810 గ్రాముల గంజాయి, రవాణాకు వినియోగిస్తున్న ట్రాలీ ఆటో, రూ.6,100ల నగదు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. పట్టుబడిన వారిలో రాంబాబు భద్రాద్రి జిల్లా అశ్వాపురం గ్రామవాసి కాగా, ప్రస్తుతం ఏపీ రాష్ట్రం చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లిలో నివాసముంటున్నాడు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఇల్లెందు టౌన్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): సెంట్రింగ్ పని చేస్తూ ప్రమాదవశాత్తు కిందపడిపోయిన వ్యక్తి తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృత చెందిన సంఘటన శనివారం ఇల్లెందులో చోటుచేసుకుంది. పట్టణ సమీపంలోని సంజయ్‌నగర్‌కు చెందిన గురు ప్రసాద్(57) గత మూడు రోజుల క్రితం పట్టణంలోని శివాలయం సమీపంలో సెంట్రింగ్ పని చేస్తూ కాలు జారి కిందపడిపోయాడు. స్థానికులు వెంటనే తీవ్ర గాయాలపాలైన అతడిని ఖమ్మం మమతా ఆసుపత్రికి తరలించారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు ఇల్లెందు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి ...

సత్తుపల్లిరూరల్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని బేతుపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేతపల్లి గ్రామానికి చెందిన కూలి పనులకు వెళ్లే పసుమర్తి సాంబశివరావు(32) శుక్రవారం రాత్రి ఇంటిలో మంచంపై నిద్రించిన సాంబశివరావు, శనివారం ఉదయం మంచం వద్ద కింద పడిపోయి మృతి చెంది ఉన్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కుమారుడు మృతి పట్ల అనుమానం ఉందని తల్లి భాగ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అన్నదాతకు వి 'పత్తి'

- తెల్లబోతున్న పత్తి రైతు
- తగ్గిన దిగుబడులు
- పరోక్షంగా దెబ్బతీసిన వరుణుడు
- మార్కెట్‌లోనూ దోపిడీయే

కూసుమంచి, నవంబరు16(ఆంధ్రజ్యోతి): ప్రతికూల వాతావరణ పరిస్థితులు పత్తి రైతును కోలుకోలేని దెబ్బతీశాయి. గతంలో కంటే ఈసారి ఎకరా సాగుకు సుమారు రూ.15వేల వరకు పెట్టుబడి అదనంగా పెరిగింది. ఈఏడాది ఆదినుంచే వరుణుడు పత్తి రైతును పరోక్షంగా దెబ్బతీశాడు. వర్షాలకు గూడ రాలిపోవడం, పూత పిందె రాలిపోవడం, విపరీతమైన తెగుళ్ల సోకాయి. ఉదయం ఎండలు, సాయంత్రం వర్షాలు.. ఇలా వాతావరణంలో మార్పులు దిగుబడిపై ప్రభావం చూపాయి. పత్తి పదునెక్కి, చివరకు వ్యాపారులు కొనలేని పరిస్థితి నెలకొంది. దీంతో పెట్టుబడులు పెరగడం, చేసిన అప్పులు తీర్చలేని పరిస్థితికి చేరింది.

రైతులపై ఆర్థికభారం

వాతావరణంలో పరిస్థితుల కారణంగా పత్తి దిగుబడులు భారీగా తగ్గాయి. ఒక్కోసారి భారీ వర్షాలు, ఒక్కోసారి అధిక ఎండలు.. సమతుల్యత లేకపోవడంతో పంటకు తెగుళ్ల సోకాయి. దీంతో ఎర్రబారడం, పూత పిందే రాలిపోవడం, ఎదుగుదల లేకపోవడం వంటి సమస్యలు నెలకొన్నాయి. ఒక్క కాపుతోనే పంట ఎండిపోయే పరిస్థితి నెలకొంది. దీంతో పురుగుమందులకు, కూలీల ఖర్చులకు పెట్టుబడి పెరిగిపోయింది. గతేడాది కూలీ ఖర్చు రూ.200 ఉంటే, ఈఏడాది రూ.250కి పెరిగింది. కొరత ఉన్న ప్రాంతాల్లో రూ.350 కూడా అడుగుతున్నట్లు రైతులు వాపోతున్నారు. గరిష్ఠంగా 12క్వింటాళ్ల వరకు దిగుబడి రావాల్సి ఉండగా, కేవలం ఆరేడు క్వింటాళ్లు మాత్రమే వస్తుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అటు మార్కెట్‌లోనూ రైతులు మోసానికి గురవుతున్నారు. తేమశాతాన్ని అడ్డంపెట్టుకుని వ్యాపారులు అమాంతం ధర తగ్గించి కొంటున్నారు. ఇటీవల ఖమ్మం మార్కెట్‌లో స్వయానా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆకస్మికంగా తనిఖీ చేసి వ్యాపారులపై, సంబంధిత శాఖా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్టుబడులు పెరగడం, మార్కెట్‌లో మోసానికి గురవడం అన్నదాతకు గోటిచుట్టూ రోకటిపోటులా తయారైంది.



పల్లెల్లో దళారుల దందా

గ్రామాల్లో దళారీ వ్యాపారుల దందా ఎక్కువయింది. ధర్మాకాంటాకు బదులు ఎలక్ట్రానిక్, గొలుసు కాంటాలు తీసుకవచ్చి వాటితో తూకాలు వేస్తున్నారు. అరుగాలం కష్టపడి సాగుచేసిన పత్తిపంట దిగుబడులు తగ్గడంతో ఉన్న కొద్దిపంట మార్కెట్‌కు తీసుకపోతే రవాణా ఖర్చులు, వ్యాపారి కమీషన్ ఖర్చులు తగ్గుతాయని ఇళ్ల వద్దే పంటను ఎంతోకొంతకు విక్రయిస్తున్నారు. రైతుల అవసరాన్ని ఆసరా చేసుకుని వ్యాపారులు తూకాల్లో మోసం చేస్తున్నారు. ఒక్కో క్వింటాకు 5నుంచి 10కేజీల వరకు దోపిడీ చేస్తున్నారు. ఇటీవల తిరుమలాయపాలెం మండలం రాజారం గ్రామానికి చెందిన ఒకరైతు నుంచి దళారీ కొనుగోలు చేయగా కాంటా తక్కువ రావడంతో రైతు నిలదీశాడు. దీంతో వ్యాపారి కాళ్ల బేరానికి వచ్చాడు. దళారులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కళలు చిన్నారుల్లో మానసిక ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయి

- డీఎంహెచ్‌వో బాణోత్ కళావతి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో కళావతి బాయి

మధిర, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కళలు చిన్నారుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీసి మానసిక ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని ఖమ్మం డీఎంహెచ్‌వో డాక్టర్ బాణోత్ కళావతి బాయి తెలిపారు. మధిర బాలోత్సవ్-2024 పోటీలలో రెండో రోజు శనివారం జరిగిన పోటీలను ఆమె పాల్గొని ప్రారంభించి ప్రసంగించారు. ప్రతి యేడు జాతీయస్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కళలను ప్రోత్సహించడం అంటే మన సంస్కృతిని కాపాడుకోవడమేనని తెలిపారు.

అలరించిన చిన్నారుల ప్రదర్శనలు

బాలోత్సవ్ పోటీలలో భాగంగా రెండోరోజు శనివారం సీసత్తా చాటుకో 45మంది, ఏకపాత్రలు 48మంది, నీతిపద్యాలు 55మంది విచిత్ర వేషదారణలు 60మంది, దేశభక్తి గీతాలాపన 47మంది పాల్గొన్నారు. పోటీలలో రెండు రాష్ట్రాలలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారులు తమ ప్రతిభ పాటవాలను ప్రదర్శించారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా తాటికొండాల నర్సింహారావు, పాకాలపాటి రోశయ్య చౌదరి వ్యవహరించారు. కార్యక్రమంలో పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, బాబ్జా, ఏటూరి హరినాద్, నాగిరెడ్డి, సోనీబాయ్, గాయని బేగం, దినకర్, గురువులు, శ్రీహరి, నాగరాజు తదితరులున్నారు.



వివిధ పాత్రలను ప్రదర్శిస్తున్న చిన్నారులు

రూ.30వేల విలువైన గుట్కా పట్టివేత

ఇల్లెందు టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు పట్టణంలోని బస్టాండ్ ఏరియాలో ఓ కిరాణా దుకాణంలో అక్రమంగా నిల్వ చేసిన రూ.30వేల విలువైన గుట్కాలు, పాన్ మసాలాలను ఇల్లెందు పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. సీఐ బత్తుల సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. బస్టాండ్ సమీపంలో శ్రీలక్ష్మిగణపతి కిరాణా దుకాణంలో గుట్కా అమ్ముతున్నారనే సమాచారం మేరకు దుకాణం తనిఖీ చేయగా, ఈ తనిఖీల్లో 42 గుట్కా ప్యాకెట్లు, 14 టోబాకో ప్యాకెట్లు, అంబర్, పాన్‌మసాలాలతోపాటు ఇతర నిషేధిత ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దుకాణ యజమాని గుగులోత్ శంకర్‌తోపాటు గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ తనిఖీలో ఎస్‌ఐ సందీప్ సిబ్బంది ఉన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అక్రమంగా ఎవరైనా గుట్కాలు తదితర నిషేధిత పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

టేకులపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఇల్లెందు-కొత్తగూడెం ప్రధాన రహదారిలోని వెంట్యాతండా మలుపు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం వైపునుంచి వెళ్తున్న సింగరేణికి చెందిన ఎక్స్‌ప్లోసివ్ వాహనాన్ని ఎదురుగా ఇల్లెందు వైపునుంచి అతివేగంగా వస్తున్న కారు అదుపుతప్పి వెంకట్యాతండా సమీపంలోని మలుపు వద్ద ఆ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన రోహిత్, కిరణ్, కీర్తి, ప్రవల్లిక, దీప్తిలకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ పి.సురేష్ క్షతగాత్రులను వెంటనే 108వాహనంలో కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

బాసర త్రిపుల్ ఐటీ విద్యార్థులకు న్యాయం చేయాలి

» బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్

నేలకొండపల్లి, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): బాసర త్రిపుల్ ఐటీ విద్యార్థులకు న్యాయం చేయాలని ప్రశ్నిస్తున్న ఏబీవీపీ నాయకులపై పోలీసులు గూండాల్లా దాడి చేయటం దారుణమని, వారికి వెంటనే న్యాయం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు రవికుమార్ శనివారం సాయంత్రం పత్రికా ప్రకటన విడుదల చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వానికి ప్రస్తుత రేవంత్ ప్రభుత్వానికి పెద్దగా తేడా లేదన్నారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	38 రూ.
వంకాయ	38
గుత్తి వంకాయ	44
బీరకాయ	38
పచ్చిమిర్చి	38
కాకరకాయ	28
బెండకాయ	24
పొట్లకాయ	44
దోసకాయ	34-58
చిక్కుడు	74
నాటుచిక్కుడు	120
గోరుచిక్కుడు	48
క్యాబేజీ	34
దొండ	30-40
సొరకాయ	30
క్యారెట్	74
క్యాప్సికం	68
ఆలుగడ్డ	38
ఉల్లిగడ్డ	60-70
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	175
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

CINEMA సినిమా

నగరంలో చిత్రాలు..

వినోద:	లక్కీభాస్కర్
శ్రీనివాస:	అమరన్
సాయిరాం:	మట్కా
ఆదిత్య:	కంగువ
తిరుమల:	దేవర
సినీ గెలాక్సీ:	ధూంధాం

ట్రాఫికర్

రోజురోజుకు విస్తరిస్తున్న ఖమ్మం నగరంలో ట్రాఫిక్ సమస్యలు అంతకంతకూ పెరుగుతున్నాయి. నగరం స్థాయికి ఖమ్మం ఎదిగినా ట్రాఫిక్ నిర్వహణ మాత్రం మునిసిపాలిటీ స్థాయిలోనే నిలిచిపోయింది. నగరంలో నిత్యం ఏదో ఒకచోట ట్రాఫిక్ జాంలు జరుగుతూనే ఉన్నాయి. వివిధ పనుల నిమిత్తం ఖమ్మం వచ్చేవారు తమ వాహనాలను ఇష్టారాజ్యంగా ఎక్కడపడితే అక్కడే పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. పోలీసులు పలుమార్లు వాహనదారులకు హెచ్చరికలు జారీచేసినా పట్టించుకునే వారు కరువయ్యారు. వైరా రోడ్డులో ఆసుపత్రులకు వచ్చే వారు తమ వాహనాలను గంటల తరబడి రోడ్లపై నిలిపి ఉంచడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



» రోడ్లపైనే యథేచ్ఛగా వాహనాల పార్కింగ్
» సిగ్నల్స్‌ను పట్టించుకోని వాహనదారులు
» రోడ్లపై ఆటోవాలాల ఇష్టారాజ్యం
» కూడళ్ల వద్ద కనిపించని ట్రాఫిక్ సిబ్బంది
» కొన్ని కూడళ్లలో ట్రాఫిక్‌లోనే వాహన తనిఖీలు

ఖమ్మం క్రైం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): షాపింగ్‌మాల్స్ వస్త్ర దుకాణాలు, ఆసుపత్రులకు అనుమతులు తీసుకునే సమయంలోనే పార్కింగ్ స్థలం చూపించాలి. కానీ అప్పుడు ఏదో ఒక స్థలం చూపించి అనుమతులు పొందుతున్న నిర్వాహకులు తరువాత ఆ పార్కింగ్ స్థలంలోనూ వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీంతో ప్రజలు రోడ్లపైనే వాహనాలు నిలిపి వెళ్లిపోతున్నారు. దీంతో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. నగరంలో కొన్ని షాపింగ్ మాల్స్ నిర్వాహకులు నేరుగా రోడ్డుపైనే పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసి వాచ్‌మెన్‌లను ఉంచుతున్నారు. కొన్ని మాల్స్ వద్ద వారికి రోడ్డుమొత్తం కేటాయించినట్టుగా రోడ్లపై వాహనాలను నిలిపేందుకు సిబ్బందిని సైతం కేటాయించారు.



ఖాళీగా ట్రాఫిక్ ఐలాండ్

యథేచ్ఛగా ట్రాఫిక్ సిగ్నల్స్ జంప్..

నగరంలో పలు కూడళ్ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసినా చాలామంది వాహనదారులు వాటిని పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వెళుతున్నారు. సిగ్నల్స్ ఉన్న ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణమని తెలుస్తోంది. రెడ్ సిగ్నల్ పడినప్పుడు కూడా కొందరు వాహనదారులు వేగంగా వెళ్లిపోతున్నారు. సిబ్బంది సరిగా లేకపోవడంతోనే ఇలాంటివి జరుతున్నాయని వాహనదారులు విమర్శిస్తున్నారు. సిగ్నల్స్ జంప్ చేసిన వాహనదారులకు జరిమానాలు విధించకపోవడంతోనే కొందరు యథేచ్ఛగా ట్రాఫిక్ నిబంధనలను ఉల్లఘిస్తున్నారు. గతంలో సీసీ కెమెరాల ద్వారా జరిమానాలు విధించేవారు. రాత్రి వేళల్లో నగరంలోని టీడీపీ కార్యాలయం రోడ్డు, మమతా ఆసుపత్రి రోడ్డు, బైపాస్ రోడ్డు ప్రాంతాల్లో యువత బైక్‌లు, కార్లను మితిమీరిన స్పీడ్‌తో నడుపుతూ వెళుతున్నారు.

రోడ్లపై ఆటోల ఇష్టారాజ్యం..

నగరంలో ఆటోవాలాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పాతబస్‌స్టాండ్, మయూరిసెంటర్‌తో పాటు పలు ప్రాంతాల్లో కొందరు ఆటోవాలాలు రోడ్లపైనే తమ ఆటోలను నిలిపి వెళుతున్నారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఆటోలు యథేచ్ఛగా రోడ్డుపై అడ్డా నిర్వహిస్తున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. రోడ్డుపై ఆటోలు నిలిపితే వాహనదారులు ఎవ్వరైనా ప్రశ్నిస్తే వారిపై దౌర్జన్యం చేసి దాడి చేసేందుకు కూడా వెనుకాడటం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత బస్‌స్టాండ్ నుంచి బస్సులు బయటకు లోనికి వెళ్లేందుకు డ్రైవర్లు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

ట్రాఫిక్‌లోనే పోలీసుల తనిఖీలు..

నగరంలో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు తరుచూ వాహనాల తనిఖీలకు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. అదికూడా ట్రాఫిక్‌లో వెళుతున్న వాహనాలను సైతం ఆపి తనిఖీలు చేస్తున్నారు. పనులపై వెళుతున్న సమయాల్లోనూ తనిఖీ పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూడళ్ల వద్ద గ్రీన్ సిగ్నల్స్ పడి వాహనదారులు వెళుతుండగానే సిబ్బంది అడ్డుకుని తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూడళ్ల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది మైనర్ డ్రైవింగ్‌లు, నెంబర్ ప్లేట్లు లేకుండా తిరిగే వాహనాలు, డ్రంకెన్‌డ్రైవ్‌పై దృష్టి సారిస్తున్నారే తప్ప ట్రాఫిక్ నియంత్రణపై మాత్రం దృష్టి పెట్టడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

నాయకులు వస్తేనే కనిపిస్తున్న సిబ్బంది

ఖమ్మం నగరంలో నాయకుల పర్యటనలు ఉంటేనే ట్రాఫిక్ కూడళ్ల వద్ద సిబ్బంది విధుల్లో కనపడుతున్నారు. వారు బయటకు వెళ్లే వరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సిగ్నల్స్‌ను వారికి ఇష్టం వచ్చినట్లు కంట్రోల్ చేసి వాహనాలను కూడళ్ల వద్ద నిలిపేస్తున్నారు. నాయకులు వెళ్లిన తరువాత వెంటనే సిబ్బంది కూడా అక్కడి నుండి వెళిపోతున్నారు. దీంతో ట్రాఫిక్‌లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు

జిల్లా గ్రంథాలయంలో కవి సమ్మేళనం

ఖమ్మం ఖానాపురంహవేలి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మూడోరోజు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శనివారం కవి సమ్మేళనం నిర్వహించి కవులకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి అర్జున్ , గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు ప్రెసిడెంట్ రాజు, కార్యదర్శి ఎండి ఇమామ్, గ్రంథాలయ సిబ్బంది కనపల్లి, భాస్కర్, అఖిల్, రవి బాబు, బాబు, లలిత కుమారి, విజయ్ కుమారి, రోజా పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ జిల్లా కమిటీ ఏకగ్రీవం

ఖమ్మం ఖానాపురం హవేలి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): టీపీటీఎఫ్ జిల్లా నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఏవీ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్ విజయ్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. నాగిరెడ్డి, ఉపాధ్యక్షుడు ఎం. కృష్ణారెడ్డి తెలిపారు. జిల్లాలోని 21 మండలాల ప్రతినిధులు హాజరయి నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. వీరితో పాటు సంఘం కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

24న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష

ఖమ్మం ఖానాపురంహవేలి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యా సంవత్సరానికి జరుగనున్న నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష నవంబరు 24న ఉదయం 9-30 నుంచి మధ్యాహ్నం 12-30 గంటల వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యా శాఖాధికారి సోమశేఖర శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు పరీక్షా హాల్‌టికెట్లను ఆన్‌లైన్ నుంచి డౌన్లోడ్ చేసుకోవాలని తెలిపారు.

దోపిడీ పాలనకు వ్యతిరేకంగా పోరాడాలి

మాస్‌లైన్ జిల్లానాయకుడు తిమ్మిడి

తిరుమలాయపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): భూస్వామ్య, పెట్టుబడిదారి, సామ్రాజ్యవాదంకు వ్యతిరేకంగా యువత పోరాడాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్‌ప్రజాపంథా జిల్లా నాయకుడు తిమ్మిడి హనుమంతరావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని బచ్చోడు, జూపెడ, హస్నాబాదు గ్రామాల్లో అమరవీరుల వారోత్సవాల్లో బాగంగా సంతాపసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు హక్కుల సాధనకోసం రాయలసుభాష్ చంద్రబోస్, రామనరసయ్య, డీవీకృష్ణ, పైలా వాసుదేవరావు, చంద్రపుల్లారెడ్డి తదితరులు అసువులు బాసారని, వారి బాటలో పయనించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై కార్యకర్తలు పోరాడాలన్నారు. అర్హులైన పేదలందరికి ఇళ్ల స్థలాలు, రేషన్‌కార్డులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పార్టీనాయకులు జీవీరయ్య, వెంకన్న, కె.వెంకయ్య, టి.రఘుబాబు, లచ్చయ్య, రాములు, నరసయ్య పాల్గొన్నారు.

సమ్మేళనంను విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు

ఖమ్మం చర్చికాంపౌండ్, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం ఖమ్మం నగరంలో నిర్వహించిన మాల, మాల ఉప కులాల ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనాన్నివిజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఖమ్మం జిల్లా కన్వీనర్ గుంతేటి వీరభద్రం పేర్కొన్నారు. శనివారం నగరంలోని అంబేద్కర్ భవన్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో లింగాల రవికుమార్, బాబురావు, జాకబ్ ప్రతాప్, సత్యం పాల్గొన్నారు.

30వ డివిజన్‌లో సమస్యలు పరిశీలించిన సీపీఐ ప్రతినిధి బృందం



నగరంలోని 30వ డివిజన్‌లో సమస్యలు పరిశీలిస్తున్న సీపీఐ ప్రతినిధి బృందం

ఖమ్మంటౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని 30వ డివిజన్ సుందరయ్యనగర్‌లో నెలకొన్న సమస్యలను సీపీఐ ప్రతినిధి బృందం శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీపీఐ జిల్లా నాయకులు మహమ్మద్ సలాం మాట్లాడుతూ 30వ డివిజన్‌లో డ్రైనేజీ కాలువల మధ్యలోనే కరెంట్ స్తంభాలు ఉన్నాయని, ఇళ్లపైనుండి విద్యుత్ తీగలు ఉండటం వల్ల ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. డ్రైనేజీల్లో మురుగు నీరు నిల్వ ఉండటంతో దుర్వాసనతోపాటు దోమలు విపరీతంగా వస్తున్నాయన్నారు. దీంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారన్నారు. సమస్యలను విద్యుత్, నగరపాలకసంస్థ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవటం లేదని విమర్శించారు. అధికారులు స్పందించకుంటే సీపీఐ ఆధ్వర్యంలో నగరపాలకసంస్థ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ ప్రతినిధి బృందంలో భూక్యా రవీందర్, నూనె శశిదర్‌తో పాటు దామళ్ల రాము, ఆకుల రమేష్, తాళ్ల రామకృష్ణ, కేశవ్, పోతురాజు కృష్ణ ఉన్నారు.

కలెక్టర్ ఆదేశాలతో మార్కెట్ వ్యాపారులకు నోటీసులు

ఖమ్మం మార్కెట్ నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో పత్తి కొనుగోలు చేసే 18 మంది వ్యాపారులతో పాటు ఒక కమీషన్ వ్యాపారికి కలిపి మొత్తం 19 మందికి శుక్రవారం రాత్రి మార్కెట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇటీవల జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మార్కెట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంలో పత్తి రైతుల వద్ద తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మార్కెట్ అధికారులు మార్కెట్ యార్డులలో అత్యధికంగా పత్తిని కొనుగోలు చేసే వ్యాపారులకు నోటీసులు ఇచ్చారు. తక్కువ ధరలకు కొనుగోలు చేయడానికి గల కారణాలను సమాధానం రూపంలో తెలపాలని సూచించారు. కావాలని పత్తిని తక్కువ ధరలకు కొనుగోలు చేస్తూ రైతులను నష్ట పరిస్తే లైసెన్సులు రద్దు చేయాలని కలెక్టర్ ఆదేశించిన దరిమిలా మార్కెట్ అధికారులు చర్యలకు పూనుకున్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

» సబ్ ఇన్‌స్పెక్టర్ జగదీష్



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎస్ఐ

తిరుమలాయపాలెం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని విద్యార్థులు కష్టపడి చదవాలని తిరుమలాయపాలెం ఎస్ఐ కూసుపుడి జగదీష్ తెలిపారు. శనివారం తిరుమలాయపాలెంలో ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహం, గిరిజన బాలికల వసతి గృహాలను ఆయన సందర్శించారు. ఈసందర్భంగావిద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరంర విద్యార్థులతో మాట్లాడారు. చదువుకుంటేనే సమాజంలో మంచి గౌరవ ప్రతిష్టలతో పాటు తమభవిష్యత్ జీవితాలకు పునాది వేసుకోవచ్చన్నారు. అలాగే కృషిపట్టుదలతో చదివి మంచి మార్కులు సాధించి జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నారు.

బాలోత్సవ్‌లో న్యూవిజన్ విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం ఖానాపురంహవేలి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మదిలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి బాలోత్సవ్ పోటీలలో నగరంలోని న్యూవిజన్ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచి ఆరు బహుమతులను పొందారని పాఠశాల ప్రిన్సిపాల్ అబాద్‌అలీ శనివారం తెలిపారు. జానపద నృత్య విభాగం నుంచి రెండు బహుమతులు, షోటో జానపద నృత్య విభాగం నుంచి ఒకటి, కూచిపుడి జూనియర్ విభాగం నుంచి ఒకటి, భరతనాట్యం సీనియర్, జూనియర్ విభాగాల నుంచి ఒక్కోటి మొత్తం ఆరు బహుమతులు పొందారని తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను శుక్రవారం పాఠశాలలో పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ సీహెచ్ కార్తీక్, ప్రిన్సిపాల్ అభినందించారు.



బహుమతులు పొందిన విద్యార్థులతో పాఠశాల ప్రిన్సిపాల్

బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేత



రంగారావు భార్యకు చెక్కును అందచేస్తున్న సొసైటీ అధ్యక్షుడు వెంకటరావు

నేలకొండపల్లి, నవంబరు16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మంగ్రాజుపల్లి పీఏసీఎస్‌లో సభ్యుడైన మందపల్లి రంగారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సభ్యుడైన రంగారావు మృతితో గ్రూపు ఇన్సూరెన్సు కింద వచ్చిన రూ.50వేల చెక్కును శనివారం సొసైటీ అధ్యక్షుడు తోట వెంకటరావు మృతుడి భార్య రేణుకకు సహకార బ్యాంకు మేనేజరు ఇందుతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ దండా రాధాకృష్ణ, రైతులు నెల్లూరి లీలాప్రసాద్, నెల్లూరి వెంకటరత్నం, సీఈఓ పరమేశ్వర రావు, సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు

ఖమ్మం ఖానాపురంహవేలి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం రెండు అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. ఇటీవల ఖమ్మం రైల్వే పోలీస్ పరిధిలోని ఖమ్మం రైల్వే స్టేషన్ మొదటి ఫ్లాట్‌ఫారం మీద గుర్తు తెలియని 40 సంవత్సరాల వ్యక్తి మృతిచెందగా పోలీస్‌లు మృతదేహన్ని ఖమ్మం ప్రభుత్వ వైద్యశాల మార్చురీలో భద్రపరిచారు. ఖమ్మం ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో గుర్తుతెలియని మగ వ్యక్తి మృతి చెంది ఉండగా ఆ మృతదేహన్ని మార్చురీలో భద్రపరిచినారు. గత నాలుగు రోజులుగా ఈ రెండు గుర్తుతెలియని మృతదేహాలు భద్రపరిచి ఉండగా ఇప్పటివరకు మృతదేహాల కొరకు ఎవరూ రాలేదు. దీంతో రైల్వే పోలీస్, వైద్యశాల సిబ్బంది సమాచారం మేరకు అన్నం ఫౌండేషన్ ఈ రెండు అనాథ మృతదేహాలను జీఆర్‌పీ ఎస్ఐ పారుపల్లి భాస్కరరావు, వైద్యశాల సిబ్బంది సమక్షంలో స్వాధీనం చేసుకొని నగరంలోని బల్లేపల్లి వైకుంఠదామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రూప్-4లో మెరిసిన విజయ్‌కిరణ్



ఖమ్మంటౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని శాంతినగర్‌కు చెందిన బుద్దా విజయ్‌కిరణ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తూ, గ్రూప్-4 ద్వారా గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్‌లో ఉద్యోగం సాధించాడు. కొత్తగూడెంలో టీజీఎస్‌పీ(ప్రత్యేక పోలీస్) విభాగంలో 2021లో కానిస్టేబుల్‌గా చేరిన విజయ్‌కిరణ్ గ్రూప్-4 పరీక్షలపై దృష్టి పెట్టారు. ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో టీఎస్‌జీసీసీలో(గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్) జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించారు.

ఎల్‌ఆర్‌ఎస్‌లో వెసులుబాటు

» ప్రొహిబిటెడ్ సరిహద్దు ల్యాండ్స్‌కు సర్దుబాటు
» మరోసారి భూ దస్త్రాల ఆప్‌లోడ్‌తో సమస్య పరిష్కారం
» 15శాతం దరఖాస్తులకు క్లియరెన్స్

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతి లేని ఇళ్ల స్థలాలకు అధికారికంగా అనుమతులు జారీ చేసేందుకు లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్‌ఆర్‌ఎస్)ను అమలులోకి తీసుకువచ్చారు. వ్యవసాయ, ఇతర భూములను ఇళ్ల స్థలాలుగా మార్పు చేసేందుకు ఎల్‌ఆర్‌ఎస్ ఉపయోగపడుతుంది. కోర్టు వివాదంలో ఉన్న భూములు, వక్ఫ్ భూములు, చెరువులు, కుంటలు, వాగులు భూములను రక్షించేందుకు ఆయా సర్వే నెంబర్లపై ప్రొహిబిటెడ్ మార్కు నమోదు చేసి ఎల్‌ఆర్‌ఎస్‌లో కండిషన్లు పెట్టారు. ఈ విధానంతో ప్రభుత్వ భూముల సరిహద్దుల్లో ఉన్న ప్రైవేటు స్థలాలపై ప్రభావం పడింది. జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల్లో 15శాతం వరకు ఇటువంటి సమస్యతో ఇళ్ల స్థలాలు క్రమబద్ధీకరణకు నోచుకోలేదు.

ఈ క్రమంలో స్థలాల యజమానుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఎల్‌ఆర్‌ఎస్‌లోని ప్రొహిబిటెడ్ భూములపై ప్రభుత్వం కొంత వెసులుబాటు కల్పించింది.

పకడ్బందీగా మార్గదర్శకాలు

తాజాగా విడుదల చేసిన ఎల్‌ఆర్‌ఎస్ స్కీంలో నూతన మార్గదర్శకాలను ఏర్పాటు చేశారు.ఎల్‌ఆర్‌ఎస్ జారీలో ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 అనే దశలు ఉంటాయి. ఎల్ 1 విభాగంలో రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్‌శాఖల అధికారులు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారుని స్థలాన్ని పరిశీలించి శాఖల వారీగా వేర్వేరుగా అనుమతులు జారీ చేయాలి. భవిష్యత్‌లో ఏదైనా ఇబ్బంది కలిగితే తప్పుడు ధ్రువీకరణ చేసిన అధికారులు బాధ్యత వహించాలి. గతంలో ఇరిగేషన్‌శాఖ అధికారులు నో డ్యూ సర్టిఫికెట్ జారీ చేస్తే మునిసిపల్ అధికారులు ఎల్‌ఆర్‌ఎస్‌ను జారీ చేసే వారు. తర్వాత ఎల్ 2, రెవెన్యూ, ఇరిగేషన్, నగర పాలక సంస్థ పర్యవేక్షణ అధికారులు, ఎల్ 3లో మునిసిపల్ అధికారి ఎల్‌ఆర్‌ఎస్ జారీ చేస్తారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా మొబైల్ యాప్‌ను రూపొందించారు.

సిటిజెన్ లాగిన్ ద్వారా..

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు తమ ఫోన్ ద్వారా సిటిజన్ లాగిన్ కావటానికి సాంకేతికంగా అనుమతి ఉంది. గతంలో సిటిజన్ లాగిన్ జరిగిన తర్వాత ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు నెంబర్ ఎంటర్ చేయగానే ప్రొహిబిటెడ్ ల్యాండ్ అని కనిపించేది. ఇప్పుడు మాత్రం సిటిజన్ లాగిన్ కాగానే ప్రొహిబిటెడ్ ల్యాండ్ వద్ద దసాలు ఆప్‌లోడ్ చేసేందుకు సాఫ్టువేర్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఎల్‌ఆర్‌ఎస్‌లో రిజెక్ట్ చేసిన సర్వే నెంబర్‌లోని భూ దస్త్రాలను తిరిగి ఆప్‌లోడ్ చేయటం ద్వారా ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ పునః ప్రారంభం అవుతుంది. నగరం పరిధిలో మొత్తం 39,945 దరఖాస్తులు ఎల్‌ఆర్‌ఎస్‌కు రాగా వాటిలో ఇప్పటి వరకు ప్రొహిబిటెడ్ ల్యాండ్ గుర్తింపుతో 4వేల దరఖాస్తులు పెండింగ్‌లో పడ్డాయి. జిల్లా వ్యాప్తంగా ఇతర ప్రాంతాల్లో వచ్చిన దరఖాస్తుల్లోను 15శాతం మేరకు ప్రొహిబిటెడ్ దరఖాస్తులు ఉన్నాయి.



కేఎంసీ హెల్ప్ డెస్క్‌లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీలించుకుంటున్న భూ యజమానులు

మూగజీవాలకు వైద్యం అందేదెలా!

- పది గ్రామాల పశువులకు అందని వైద్యం
- ఆరు నెలలకు పైగా ఖాళీగా వైద్యుడి పోస్టు
- వైద్యాధికారిని నియమించాలని గ్రామస్థుల వినతి

కొణిజర్ల, నవంబరు16(ఆంధ్రజ్యోతి): పది గ్రామాల కూడలి ఆ పశు ఆరోగ్య ఉపకేంద్రం. కాని అక్కడ వైద్యం అందని ద్రాక్షగా మారింది. దీంతో పశువులు వైద్యం అందక మృత్యువాతపడాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉపకేంద్రంలో వైద్యులు ఉండేవారు. గతంలో కొణిజర్ల పశువైద్యాధికారి వెళ్లి వైద్యం చేసేవారు. ఇప్పుడు అదికూడా లేదని పశుయాజమానులు ఆవేదన చెందుతున్నారు. పశువులకు జబ్బు చేస్తే ఏమిచేయాలో అర్థం కావడం లేదని వాపోతున్నారు. ప్రస్తుతం ఆ వైద్యశాలకు ఆఫీస్ సబార్డినేటర్ మాత్రమే ఉన్నాడు. కొణిజర్ల మండలం పెద్దగోపతి పశు ఆరోగ్య ఉపకేంద్రం పరిస్థితి ఇది.

పది గ్రామాలకు ఆ పశువైద్యశాలే దిక్కు

పెద్దగోపతి పశు ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలో పెద్దగోపతితో పాటు 10 గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాలలోని పశువులకు ఏ జబ్బు చేసిన పెద్దగోపతి పశు ఆరోగ్య ఉపకేంద్రానికి రావల్సిందే. పది గ్రామాలకు కేంద్రంగా ఉన్న పశుఆరోగ్య ఉపకేంద్రాన్ని పశువైద్యశాలగా మార్చి నిరంతరంగా అన్ని పశువైద్యశాలలకు ఉండే సిబ్బంది వలే ఇక్కడ కూడా నియమించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇటీవల దూడలకు వైద్యం అందక సుమారు మూడు నుంచి నాలుగు దూడలు చనిపోయిన్నట్లు స్థానికులు తెలుపుతున్నారు. పశు ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలో సుమారు 3వేలు తెల్లపశువులు, 6వేలు నల్లపశువులు, 4వేలు గొర్రెలు, 2వేలు మేకలు ఉన్నాయి. ప్రభుత్వం ఉన్నతాధికారులు స్పందించి వైద్యులను నియమించాలని కోరుతున్నారు.

ఇటీవల కలెక్టర్‌కు వినతి

పశు ఆరోగ్య ఉపకేంద్రంలో వైద్యులను నియమించి జబ్బున బారిన పడుతున్న పశువులను కాపాడాలని కోరుతూ ఇటీవల గ్రామానికి చెందిన రంజిత్ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి గ్రామస్థులు వినతిపత్రాన్ని అందజేశారు. రెండు మండలాలకు ఉపయోగపడుతున్న పశువైద్యశాలను పట్టించుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పది గ్రామాలు ఉన్నప్పటికీ పెద్దగోపతి పశు ఆరోగ్య ఉపకేంద్రానికి వీఎల్‌వో పోస్టు మాత్రమే ఉంది. ఆరోగ్య ఉపకేంద్రం కాకుండా పశువైద్యశాలను చేయాలని, పూర్తిస్థాయిలో పశువైద్యాధికారిని నియమించాలని రైతులు కోరుతున్నారు.



వైద్యాధికారి లేని పెద్దగోపతిలోని పశు ఆరోగ్య ఉపకేంద్రం

వైద్యం కోసం ఇబ్బంది పడుతున్నాం

● ముత్తమాల శవిరి

పశువులకు ఏ జబ్బు చేసిన వైద్యశాలలో డాక్టర్ లేకపోవడం వలన ఇబ్బందులు పడుతున్నాం. తమ గ్రామానికి ప్రస్తుతం ఉప కేంద్రం ఉంది. పశువులు అధికంగా ఉన్నాయి. గతంలో వీఎల్‌వో ఉండేవారు. గత ఆరునెలలు నుంచి ఆ పోస్టులోకి ఎవరూ రాలేదు. వీఎల్‌వో పోస్టు కాకుండ ఎగ్యులర్ వైద్యుల పోస్టు మంజూరు చేసి పశువులను కాపాడాలి.

ఖమ్మంపాడు గ్రామంలో..

మధిర రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మధిర మండలం ఖమ్మంపాడు పశువైద్యశాలకు గత 11నెలల నుంచి వైద్యాధికారి పోస్టు ఖాళీగా ఉంది. సిబ్బంది కూడా లేరు. దీంతో పశువైద్యశాల మూతపడింది. మూగజీవాలకు వైద్యం అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఖమ్మంపాడు గ్రామం పరిధిలో రెండు వెటర్నరీ సబ్‌సెంటర్లు నడుస్తున్నాయి. ఈ గ్రామ పశు వైద్యశాల పది గ్రామాలకు కేంద్రంగా ఉంది. ఇక్కడ ఉండే వైద్యాధికారే మొత్తం పది గ్రామాల్లో వైద్యసేవలందించాల్సి ఉంది. ఇల్లూరు, దెందుకూరు సబ్‌సెంటర్లు సిబ్బందితో నడుస్తున్నాయి. ప్రధాన వైద్యశాల ఉన్న ఖమ్మంపాడు పశువైద్యశాలలో మాత్రం డాక్టర్, సిబ్బంది అందుబాటులో లేరు. వైరా మండలం తాటిపూడి గ్రామం నుంచి తూతూమంత్రంగా వచ్చి వైద్యసేవలు అందిస్తూ వెళ్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో పశువులు రోగాల బారీనపడితే స్థానిక రైతులతో పాటు చూట్టూపక్కల గ్రామాల రైతులు తమ మూగజీవాలను మధిర పట్టణానికి తీసుకువెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు. ఇప్పటికే స్థానికులు ఈ విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ పశువైద్యశాలకు రెగ్యులర్ వైద్యాధికారిని నియమించాలని రైతులు కోరుతున్నారు.

క్షయవ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్‌వో కళావతి

మధిరటౌన్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): క్షయ నివారించ దగ్గ వ్యాధి అని దీనిపై ఎటువంటి అపోహలు, ఆందోళన చెందనవసరం లేదని ఖమ్మం జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతీ భాయి అన్నారు. ఆదివారం ఆమె మధిర ప్రభుత్వ ఆసుపత్రి లోని టీబీ విభాగాన్ని పరిశీలించి రోగులకు అందుతున్న మందులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు పార్థసారథి వితరణ చేసిన దుప్పట్లను ఆమె అందజేశారు. ఈ కార్యక్రమంలో మధిర ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ పృథ్వీతేజ, టీబీ యూనిట్ సూపరవైజర్ సందీప్, హెల్త్ అసిస్టెంట్లు కొండయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.


దుప్పట్లు పంపిణీ చెస్తున్న డీఎంహెచ్‌వో కళావతి

ధాన్యం సైజు కొలత నిబంధన ఎత్తివేయాలి

- రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

వైరా, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మైక్రో మిషన్‌లో ధాన్యం గింజ సైజు కొలిచే నిబంధనను ఎత్తివేయాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. వైరా వ్యవసాయ మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో ప్రభుత్వం విధించిన నిబంధనలు నిరసిస్తూ రైతుసంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. మైక్రో మిషన్‌లో ధాన్యం గింజ పొడవు ఆరు మిల్లీమీటర్లు, వెడల్పు రెండు మిల్లీమీటర్ల నిబంధనను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు మల్లెంపాటి రామారావు, చింతనిప్పు చలపతిరావు, పైడిపల్లి సాంబశివరావు, తోట నాగేశ్వరరావు, వడ్లమూడి మధు, అమరనేని కృష్ణ, రైతులు మేదరమెట్ల పూర్ణచంద్రరావు, శ్రీనివాసరావు, నాగరాజు, వెంకటయ్య నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'సీపీఎం డివిజన్ మహాసభను జయప్రదం చేయండి'

పెనుబల్లి, నవంబరు16(ఆంధ్రజ్యోతి): వీఎం బంజర్‌లో ఈనెల 26న జరుగనున్న సీపీఎం సత్తుపల్లి డివిజన్ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు కోరారు. సీపీఎం మండల కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మహాసభలకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు హాజరవుతారని తెలిపారు. సుమారు 400మంది కార్యకర్తలు హాజరవుతారని తెలిపారు. మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు, నలమల అరుణ్‌ప్రతాప్, చలమాల నర్సింహారావు, కండే సత్యం, గుడిమెట్ల బాబు, మిట్టపల్లి నాగమణి, తడికమళ్ల చిరంజీవి, చిలకా రామచంద్రుడు పాల్గొన్నారు.

ఆయుర్వేద ఆస్పత్రుల్లో యోగా శిక్షకుల నియామకం

పెనుబల్లి, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రిలోని ఆయుర్వేద డిస్పెన్సరీలకు ఇద్దరు యోగా ఇన్‌స్ట్రక్టర్లను నియమించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ తెలిపారు. ప్రముఖ యోగా మాస్టర్ చింతకింద రామకృష్ణతోపాటు శిరీషను నియమించినట్లు వివరించారు. వారిరువురు శనివారం విధుల్లో చేరారు. కార్యక్రమంలో హోమియో డాక్టర్ శ్రీనివాస్‌నాయక్, ఆసుపత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ రాజరాజేశ్వరి, సిబ్బంది ఉన్నారు.

వైరా, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపూడిలో ఉన్న ప్రభుత్వ ఆయురేదిక్ డిస్పెన్సరీ విభాగానికి యోగా ఇన్‌స్ట్రక్టర్‌గా పి.పద్మావతి నియమితులయ్యారు. వైరా మునిసిపాలిటీలోని బ్రాహ్మణపల్లి అగ్రహారానికి చెందిన పద్మావతిని రాష్ట్ర ప్రభుత్వం యోగా ఇన్‌స్ట్రక్టర్‌గా నియమించింది. అలాగే మధిర మండలంలోని ఆయుర్వేద డిస్పెన్సరీకి యోగా ఇన్‌స్ట్రక్టరీగా ఎం.కృష్ణ నియమితులయ్యారు. ఆయుర్వేద డాక్టర్ జె.రాకేష్ ఆధ్వర్యంలో ఈ యోగా తరగతులను శుక్రవారం నుంచి ప్రారంభించారు.

'ఖాతాదారులంతా ఇన్సూరెన్స్ చేయించుకోండి'

సత్తుపల్లిరూరల్, నవంబర్16 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు ఖాతాదారులంతా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని గంగారం ఏపీజీవీబీ మేనేజర్ శోభా కోరారు. శనివారం బ్యాంక్ ఆవరణలో పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బివై, అటల్ పెన్షన్ యోజన, జనరల్ ఇన్సూరెన్స్ వంటి పథకాలపై అవగాహన కల్పించారు. రూ.1456తో బీమా చేయించుకుంటే ప్రమాదంలో మృతిచెందిన వారి నామినికి రూ.24లక్షలు ఇన్సూరెన్స్ వర్తిస్తుందని, ఇలాంటి పథకాలలో ఇన్సూరెన్స్ చేయించుకుంటే మృతి చెందిన వారి కుటుంబాలకు భరోసా కల్పించిన వారవుతారన్నారు. అనంతరం ఇటీవల మృతిచెందిన రామానగరానికి చెందిన దార్ల బేబీ డ్వాక్రా గ్రూప్ సభ్యురాలు అయినందున ఆమె నామినీకి రూ.2లక్షల చెక్కును బీమాగా అందించారు. కార్యక్రమంలో బ్యాంక్ ఉద్యోగులు రవికుమార్, జగదీష్, బ్యాంక్‌మిత్ర జయంతి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఖమ్మంలో బీసీ కమిషన్ సమావేశం

సత్తుపల్లిరూరల్, నవంబరు16 (ఆంధ్రజ్యోతి) : నేడు ఖమ్మంలోని కలెక్టర్ కార్యాలయం మీటింగ్ హాల్‌లో బీసీ కమిషన్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సత్తుపల్లి మునిసిపల్ కమిషనర్ మందా రవిబాబు శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి బీసీ కమిషన్ చైర్మన్ బుసని వెంకటేశ్వరరావు, రిటైర్డ్ ఐఏఎస్, బీసీ కమిషన్ సెక్రటరీ సైదులు (ఐఎఫ్ఎస్)లచే నిర్వహించబడుతుందని చెప్పారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు వినతిపత్రాలు, సూచనలు, అభ్యంతరాలు ఉన్నట్లయితే హాజరై లిఖిత పూర్వకమైన దరఖాస్తులను అందజేయాలని కోరారు.

రాజకీయ లబ్ధికోసం దాడులు చేస్తున్న బీఆర్ఎస్

- ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లి, నవంబరు16(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన చూసి ఓర్వలేని బీఆర్ఎస్ నాయకులు రాజకీయ లబ్ధికోసం భౌతిక దాడులు చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ఆరోపించారు. శనివారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ లగచర్లలో రైతుల ముసుగులో భూములు లేని బీఆర్ఎస్ కార్యకర్తలు జిల్లా కలెక్టర్‌పై దాడిచేశారని ఆరోపించారు. రాజకీయంగా లబ్ధిపొందే క్రమంలో బీఆర్ఎస్ అగ్ర నాయకులు భౌతిక దాడులను ప్రోత్సహించారని అన్నారు. అసలు భూమేలేని వ్యక్తులు గొడవలు, దాడులు చేశారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్దికాలంలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో హామీలను అమలు చేస్తూ వస్తున్నారని, దీనిని జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేసేందుకు దిగజారి ప్రవర్తించారని విమర్శించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ రాక్షసపాలన తట్టుకోలేక రాష్ట్రప్రజలు బీఆర్ఎస్‌ను పక్కన పెట్టినప్పటికీ ఆపార్టీ నాయకులకు జ్ఞానోదయం కలగలేదన్నారు. బీఆర్ఎస్ నాయకుల కుటిల రాజకీయాలను బయట పెడుతుంటే కాంగ్రెస్ నాయకుల భాష సక్రమంగా లేదంటూ బీఆర్ఎస్ గగ్గోలు పెడుతుందని, భాష, సంస్కృతి ఎక్కడ నుంచి మొదలైందో ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు.

కల్లూరు మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు రూ.23.02లక్షల విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను, అదే విధంగా నియోజకవర్గానికి సంబంధించి రూ.14.38లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

గ్రూప్-3 పరీక్షా కేంద్రాల పరిశీలన


పల్లిపాడులోని పరీక్షాకేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో నరసింహరావు

కొణిజర్ల, నవంబరు16(ఆంధ్రజ్యోతి): మండలంలో ఏర్పాటు చేసిన గ్రూప్-3 పరీక్షా కేంద్రాలను శనివారం ఆర్డీవో నరసింహరావు సందర్శించి వసతులను పరిశీలించారు. గ్రూప్-3 పరీక్షలు పకడ్బందీగా జరుగనున్నాయని తెలిపారు. అన్ని పరీక్షాకేంద్రాలలో వసతులు సక్రమంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తఫ్జల్ హుస్సేన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడికి సన్మానం

కొణిజర్ల, నవంబరు16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తుమ్మలపల్లి గ్రామానికి చెందిన వేముల మురళి గ్రూప్-4లో ఉద్యోగం సాధించాడు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మురళిని శనివారం అభినందించి శాలువతో సన్మానించారు. సన్మానించిన వారిలో సీపీఐ జిల్లా నాయకులు దొండపాటి రమేష్, మాజీ సర్పంచ్ కట్ల సత్యం, మండల సీపీఐ నాయకులు గడల శ్రీనివాసరావు, ఎస్‌కే సైదులు, బొడ్డుపల్లి కోటేశ్వరరావు, బోనపల్లి రాజా, జోగు దుర్గయ్య, యోహాన్, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

తల్లాడ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం కలకొడిమ, బస్వాపురం గ్రామాల్లో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, సొసైటీ చైర్మన్ దిరిశాల నర్సింహారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో రైతులకు సంక్షేమ పథకాలు, సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏవో తాజుద్దీన్, మాజీ సర్పంచ్ ఆదూరి దాసూరావు, నాయకులు పాల్గొన్నారు.

ఖాళీ స్థల యజమానులకు నోటీసులు

మధిరటౌన్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): మధిర మునిసిపాలిటీ లో గల ఖాళీ ఇండ్ల ప్లాట్లలో పిచ్చి మొక్కలు, కంప చెట్లు ఉన్న యజమానులకు మునిసిపల్ సిబ్బంది ఆదివారం నోటీసులు అందచేశారు. ఇటీవల మునిసిపాలిటీ పై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సమీక్ష నిర్వహించిన సందర్భంగా ఖాళీ ప్లాట్లలో పిచ్చి మొక్కలు, ఇళ్ల ముందు ర్యాంపులు ఉన్న యజమానులకు నోటీసులు ఇచ్చి వారం రోజుల్లో తొలగించేలా చూడాలని ఆదేశించారు. వారం తరువాత ఇళ్ల ముందు ఉన్న ర్యాంపులను తొలగించక పోతే కమిషనర్ ను సస్పెండ్ చేస్తానని హెచ్చరించడంతో మునిసిపల్ సిబ్బంది చర్యలకు ఉపక్రమించారు.

'అన్నిదానాలలో కన్నా అన్నదానం మిన్న'

మధిరటౌన్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): అన్నిదానాలలో కన్నా అన్నదానం మిన్న అని మధిర బంజారా కాలనీ వేంకటేశ్వరస్వామి దేవాలయం పాలక మండలి అధ్యక్షురాలు గుర్రం ప్రమీల అన్నారు. శనివారం ఆమె దేవాలయం వద్ద దాతలు కొంగర నిఖిలేష్, ఆవుల శ్రీను, కృష్ణమూర్తిల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కటకం నరసింహారావు, వీరారెడ్డి, శ్రీను, సూరి సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు గన్నీసంచుల కొరత లేదు

- జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య

తల్లాడ, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలోని ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణకు గన్నీసంచుల కొరత లేదని జిల్లా వ్యవసాయ అధికారి డి.పుల్లయ్య అన్నారు. శనివారం తల్లాడ మండలంలోని తెలగవరం, నూతనకల్, తల్లాడల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చే రైతులకు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులు ధాన్యం విశ్లేషణ పత్రం ఇచ్చిన వాటికి మాత్రమే గన్నీసంచులు ఇవ్వాలని, కొనుగోలు కేంద్రాలకు సరిపడా ముందే గన్నీసంచులు తెచ్చి తెచ్చుకోవాలని సూచించారు. ధాన్యం విశ్లేషణ పత్రం ఇచ్చిన 24గంటల్లోపే ధాన్యం కొనుగోలు కేంద్రాలకు కేటాయించబడిన రైస్‌మిల్లులకు ధాన్యాన్ని పంపాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో ఎండీ.తాజుద్దీన్, వీఆర్ఏలు పాల్గొన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య

స్వాతంత్ర్య సమరయోధుడు వీరయ్య మృతి



చింతకాని, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగులవంచ గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అంబటి వీరయ్య (97) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. పలువురు నాయకులు మృతదేహంపై పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు. మృతుడు కుమారుడు మండల పార్టీ అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లును పరామర్శించారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు మొక్కా శేఖర్‌గౌడ్, కన్నెబోయిన గోపి, బొడ్డు బొందయ్య, కన్నెబోయిన గోపి, మడిపల్లి భాస్కర్, కూరపాటి కిషోర్, బందెల నాగార్జున, బొర్రా ప్రసాద్, సట్టు వెంకటేశ్వర్లు, తిరుపతి గోవిందరావు, వెంకటేశ్వర్లు తదితరలున్నారు.

బాలోత్సవంలో దెందుకూరు విద్యార్థులకు బహుమతులు


బహుమతులు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మధిరటౌన్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): మధిరలో జరుగుతున్న మధిర బాలోత్సవంలో వివిధ పోటీలలో దెందుకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించారు. వివిధ విభాగాలలో మొత్తం ఏడుగురు విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించగా ఉపాధ్యాయులు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సాధుసమాధానం, ఉపా ధ్యాయులు వెంకటేశ్వరావు, సుబ్బారావు, సుధాకర్, వినోద్ రావు తదితరులున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ముదిగొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సిఫార్సు మేరకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును ముదిగొండకు చెందిన దేరంగుల సైదులుకు మాజీ జడ్పీటీసీ మందరపు నాగేశ్వరరావు శనివారం అందజేశారు. రూ.55వేల చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడు ఉసికల రమేష్, మందరపు ఉపేంద్రరావు, కొమ్ము నర్సింహారరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జమలయ్యకు నివాళి

ముదిగొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం సువర్ణాపురం గ్రామానికి చెందిన రావూరి జమలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఆయన దశదిన కర్మ శనివారం నిర్వహించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ జమలయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పసుపులేటి దేవేంద్రం, జెట్టి వినోద్, వీరభద్రం పాల్గొన్నారు.

కారేపల్లి సంత చైర్మన్

పదవి కోసం నాయకుల పాట్లు

కారేపల్లి, నవంబరు16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంణంలోని సంత చైర్మన్ పదవిని దక్కించుకునేందకు అధికార పార్టీకి చెందిన పలువురు నాయకులు పైరవీలు చేసుకుంటున్నారు. మంత్రులతోపాటు స్థానిక వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌తో ఎప్పటికప్పుడు టచ్‌లో ఉంటూ ఏలాగైనా సరే సంత చైర్మన్ పదవిని దక్కించుకోవాలనే ప్రయత్నంలో ఉన్నారు. నిన్నటివరకు బీఆర్ఎస్ పార్టీలో సంత చైర్మన్‌గా కొనసాగిన అడ్డగోడ అయిలయ్య ఇటీవలనే ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీ జెండా కప్పుకున్నాడు. అయితే ఎమ్మెల్యే తనకు అత్యంత సన్నహితుడు కావడంతో తిరిగినన్నే చైర్మన్‌గా నియమిస్తాడని ప్రచారం జరుగుతుంది. అయితే మొదటినుంచి కాంగ్రెస్ పార్టీలో చురుకైన నాయకుడిగా కొనసాగుతూ పార్టీకష్ట సుఖాలలో ఉన్న సమయంలో అండగా నిలిచిన ప్రముఖ వ్యాపారవేత సురేందర్ మనీయర్ తనకు అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌ను పదేపదే కోరుతున్నట్లు సమాచారం. వీరే కాకుండా మరికొంత మంది అశావహులు తమకు చైర్మన్ కావాలని కోరుతున్నట్లు సమాచారం. ఇటీవల కొంత మంది ఎండోమెంట్‌శాఖ అధికారులు సంత అభివృద్ధి కృషి చేస్తుండటంతో ఆలయానికి కొంత ఆదాయం పెరుగుతుంది. దీంతో చైర్మన్‌గా గెలుపొందినవారు ఆదాయం మరింతపెరిగేందుకు తమ వంతు కృషి చేస్తామనే ధోరణి లోఉన్నారు. ఆ వెంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ పదవిని ఎవరికి కట్టబెట్టివారితో సేవలు చేయించుకుంటారో వేచిచూడాలి.

ఆకట్టుకున్న ఆర్ట్ ఎగ్జిబిషన్

తల్లాడ, నవంబరు16(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలభారతి విద్యాలయంలో శనివారం నిర్వహించిన ఆర్ఆర్ మెమోరియల్ ఆర్ట్ ఎగ్జిబిషన్ విశేషంగా ఆకట్టుకుంది. ఎగ్జిబిషన్‌లో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, సంఘసంస్కర్తలు, శాస్త్రవేత్తలు, కవులు, కళాకారుల చిత్రపటాలను ప్రదర్శించారు. ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ఎంఈవో ఎన్.దామోదర్‌ప్రసాద్ సందర్శించి విద్యార్థుల కృషిని అభినందించారు. ఇటువం టి కార్యక్రమాలు విద్యార్థుల్లో చరిత్ర అభిమా నాన్ని పెంచటమే కాక సమాజం కోసం కృ షిచేసిన మహనీయుల పట్ల గౌరవాన్ని పెంపొందిస్తాయని కొనియాడారు కార్యక్రమంలో కోటగిరి ప్రవీణ్, యాచమనేని ప్రశాంత్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో

దంపతులకు తీవ్రగాయాలు

వైరా, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వైరా-జగ్గయ్యపేట, మధిర రోడ్డులో స్థానిక ఇందిరమ్మ కాలనీ సమీపంలో ఎదురుగా వచ్చిన యాష్ ఢీకొనడంతో ఇద్దరు దంపతులకు తీవ్రంగా గాయపడ్డారు. కొణిజర్ల మండలం పెద్ద మునగాల గ్రామానికి చెందిన గుడిపల్లి భిక్షం, విజయ దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. వైరాలో ఓ శుభ కార్యక్రమానికి ద్విచక్రవాహనంపై వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా జగ్గయ్యపేట నుంచి వైరా వైపు వస్తున్న యాష్ ట్యాంకర్ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన దంపతులను 108వాహనంలో ఖమ్మం తరలించారు. వైరా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధిగా పొట్లపల్లి



పెనుబల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పొట్లపల్లి వెంకటేశ్వరరావును కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమిస్తూ నియామకపత్రాన్ని జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అందజేశారు. వెంకటేశ్వరరావు ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ విజయకుమార్ అనుచరుడిగా ఎంతోకాలంగా కాంగ్రెస్ పార్టీకి సేవలందించారు. ఆయన సేవలను గుర్తించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమించారు. తనపై నమ్మకం ఉంచి తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ విజయ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషిచేస్తానని, కాంగ్రెస్ అమలుచేస్తున్న ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరేవిధంగా కృషి చేస్తానని తెలిపారు.

ప్రజా సమస్యలపై స్పందించిన ఈవోకు అభినందన

కల్లూరు, నవంబరు16(ఆంధ్రజ్యోతి): కల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజా సమస్యలపై స్పందించిన ఈవో నందిశెట్టి నాగేశ్వరరావుకు స్థానిక కాంగ్రెస్ నాయకులు అభినందించారు. శనివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో మండల కాంగెస్ సీనియర్ నాయకుడు పెద్దబోయిన దుర్గాప్రసాద్, మాజీ ఎంపీపీ జొన్నలగడ్డ గోపాలస్వామి, మాజీ ఎంపీటీసీ మాదిరాజు లక్ష్మణరావులు ఈవోకు బొకే అందిస్తూ అభినందించారు. మధిర రహదారి వైపున ప్రయాణికులకు ప్రమాదకరంగా ఉన్న మ్యాన్ హోల్ సమస్యను ఈవోకు తెలియపరచగా వెంటనే స్పందించారని, పారిశుధ్యం, తాగునీరు వంటి సమస్యలను పరిష్కారిస్తున్నారని వివరించారు. ఎస్‌కే అఫ్రోజ్, ఖమ్మంపాటి వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, యాఖుబుమీయా ఉన్నారు.

వైరా ప్రాథమిక ఆస్పత్రి తనిఖీ

వైరా, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వైరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న వైద్య విధాన పరిషత్‌కు చెందిన ఆసుపత్రిని శనివారం జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి కె.రాజశేఖర్‌గౌడ్ తనిఖీ చేశారు. సిబ్బంది హాజరుశాతం ఎలా ఉందని పరిశీలించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న మందుల నిల్వల గురించి ఆరా తీశారు. ఒక గర్భిణీ మహిళను పరీక్షించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ తాతా ఉదయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

కులగణనను

సద్వినియోగం చేసుకోవాలి

- కౌన్సిలర్లు మల్లాది వాసు, సవిత

మధిరటౌన్,నవంబరు16(ఆంధ్రజ్యోతి): వార్డు ప్రజలు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణను సద్వినియోగం చేసుకోవాలని 9,10 వార్డు కౌన్సిలర్లు మల్లాది వాసు, సవిత లు కోరారు. ఆదివారం తమ వార్డుల్లో జరుగుతన్న కులగణనను పరిశీలించి తమ ఇంటికి వచ్చిన సిబ్బందికి వివరాలు అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబంలో ఎవరో ఒకరు తమ ఇంటికి వచ్చిన సిబ్బందికి వివరాలు అందించి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్యుమరేటర్లు ఉన్నారు.

రాజకీయ నాయకుడు

వెంకటనర్సయ్య మృతి



కల్లూరు, నవంబరు16(ఆంధ్రజ్యోతి) మండలంలోని లంగాల గ్రామానికి చెందిన రాజకీయ నాయకుడు హనుమంత్ వెంకటనరసయ్య(62) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. వెంకటనరసయ్య ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐలలో నుంచి చురుకైన పాత్ర వహించారు. కొంత కాలం బీఆర్ఎస్‌లో పని చేశారు. గత మూడేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ తన స్వగృహంలో మృతి చెందారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మాజీ ఎంపీపీ బీరవల్లి రఘు, కట్టా అజయ్‌కుమా ర్, సొసైటీ అధ్యక్షుడు నర్వనేని అంజయ్య, తన్నీరు కృష్ణార్జునరావు, మాదాల వెంటేశ్వరరావు, పాండు, మోహనరావు, గోపాలరావు, వెంకటరామిరెడ్డి తదితరులు నివాళులర్పించారు.

నేడు కాకతీయ

కమ్మవారి వనసమారాధన

పెనుబల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీకాకతీయ కమ్మ సేవసమితి పెనుబల్లి మండల ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన ఆదివారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బొల్లం వెంకటరామారావుకు చెందిన మామిడితోటలో ఈ వనసమారాధన జరుగుతుందని తెలిపారు.